మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 170 | పేజీలు : 8 | వెల : రూ.2/- గురువారం 16 జులై 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# నదుల అనుసంధానంతోనే కరువు నివారణ

**- పెన్నా- వంశధార నదుల అనుసంధానం లక్ష్యం**

పట్టిసీమతో గోదావరి తరలింపు చేపట్టి చూపాం

కెఎల్ రావు దార్శనికత వల్లనే అనేక ప్రాజెక్టుల నిర్మాణం

గంగా-కావేరి నదుల అనుసంధానం చేస్తే తిరుగుండదు

కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి





**విజయవాడ,మన జనప్రగతి జులై 15:** నదుల అనుసంధానం పూర్తి చేస్తే.. రాష్ట్రానికి కరవు ఉండదని స్పష్టం ముఖ్యమంత్రి చంద్రబాబు చేశారు. పెన్నా-వంశధార నదుల అనుసంధానం చేయాలనేది లక్ష్యమని పేర్కొన్నారు. . వచ్చే మూడేళ్లలో రూ. 35వేల కోట్లు ఖర్చు చేసి.. 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. గంగా-కావేరి నదుల అనుసంధానం చేయగలిగితే దేశానికి తిరుగుండదన్నారు. రెండేళ్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ. 24వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. మిగతా2లో...



# సమర్థవంతంగా పోక్సో చట్టం అమలు

**● షాబాద్ ఘటనలో బెయిల్ రావడం పోలీసుల వైఫల్యం ● పోక్సో కేసుల్లో కఠినంగా వ్యవహరిస్తే మంచిది ● సిఎం రేవంత్‌కు పవన్ కళ్యాణ్ లేఖ**

**హైదరాబాద్,మన జనప్రగతి జులై 15:** పోక్సోచట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు చిన్నారులపై లైంగిక నేరాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. బాధితులకు వేగవంతమైన న్యాయం అందించేందుకు పలు కీలక ప్రతిపాదనలను ఆయన లేఖలో పొందుపరిచారు. తెలంగాణలో జరిగిన షాబాద్ ఘటనను ఉదాహరణగా ప్రస్తావించిన పవన్, బెయిల్‌పై విడుదలైన నిందితుడు ఆరుగురిని హత్య చేసిన సంఘటన తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. పోక్సో కేసుల్లో నిందితుల బెయిల్‌ను మరింత కఠినంగా పరిశీలించాలని, బాధితులు మరియు వారి కుటుంబాలకు పటిష్టమైన భద్రత కల్పించాలని సూచించారు. పోక్సో కేసులను దర్యాప్తు చేసే అధికారులకు తప్పనిసరిగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆయన ప్రతిపాదించారు. బాలలతో సున్నితంగా వ్యవహరించడం, ఫోరెన్సిక్ ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాల సేకరణ, కేసుల నిర్వహణ వంటి అంశాలపై మిగతా2లో...

## కూటమి పాలనలో రైతులకు కన్నీరు.. సిండికేట్లకు పన్నీరు : వైఎస్ జగన్



**అమరావతి,మన జనప్రగతి జులై 15:** ఏపీలోని కూటమి ప్రభుత్వ పాలనపై వైఎస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్ నిప్పులు చెరిగారు. చంద్రబాబు పాలనలో మిగతా2లో...

# భారత్ పెట్టుబడుల్లో 25శాతం మనరాష్ట్రానికే...

**● త్వరగా అనుమతులు ఇవ్వడం వల్ల పెట్టుబడుల రాక ● దాల్మియా సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ ● శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్ ● జగన్‌ది హింట్ అండ్ రన్ పార్టీ అంటూ విమర్శలు**




**కడప,మన జనప్రగతి జులై 15:**రాష్ట్రంలో అనుమతులు త్వరగా ఇవ్వడం వల్లే భారీగా పెట్టుబడులు వస్తున్నాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయని అన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోటీపడి పరిశ్రమలను తీసుకొస్తున్నామని చెప్పారు. వైఎస్ఆర్ కడప జిల్లా మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ రెండోప్లాంట్ విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. దాల్మియా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియాతో కలిసి లోకేశ్ భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. సిమెంట్ ఉత్పత్తి రంగంలో దాల్మియా గ్రూప్ బలమైందన్నారు. మిగతా2లో...

# తుదిదశకు అహ్మదాబాద్ విమాన దుర్ఘటన దర్యాప్తు

**కేంద్ర పౌర విమానమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు**




**న్యూఢిల్లీ,మన జనప్రగతి జులై 15:**అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాద దర్యాప్తు తుది దశకు చేరిందని కేంద్ర పౌర విమానమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. అతి త్వరలోనే ఈ ప్రమాదానికి సంబంధించిన తుది నివేదిక వస్తోందని పేర్కొన్నారు. త్వరగా నివేదిక ఇవ్వడం కంటే.. ప్రమాదం అసలు నిజాన్ని బయటపెట్టడమే తమకు ముఖ్యమని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు బృందం ఇచ్చిన నివేదికపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. గతేడాది జూన్ 12వ తేదీన అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ఇండియా +m-171 బోయింగ్ విమానం కుప్ప కూలిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 229 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో పాటు భూమిపై ఉన్న 19 మంది.. మొత్తం 260 మంది మృతిచెందారు. ఈ ఘటనలో విమాన వ్యవస్థలు, బ్లాక్ బాక్స్ డేటా, ఇంజిన్ భాగాల విశ్లేషణలో మిగతా2లో...




# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**నేరాల నియంత్రణకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు**

**హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత**

**అనకాపల్లి,మన జనప్రగతి జులై 15:** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు చాలా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై ఓ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బుధవారం అనకాపల్లి జిల్లాలోని వేంపాడు టోల్ ప్లాజా సమీపంలోని భారతి కన్వెన్షన్‌లో అభయ కార్యక్రమాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా అభయ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మిగతా2లో...

# ఆయుష్ వైద్యానికి హబ్‌గా ఆంధ్రప్రదేశ్

● ఆయుర్వేద, యునాని, నేచురోపతి కళాశాలలు, ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులతో ప్రాచీన వైద్యానికి పునర్ వైభవం ● 1500 ఆయుష్ డిస్పెన్సరీల ఆధునీకీకరణ పనులు ● మొత్తం రూ. 414 కోట్ల వ్యయనీ ఔషధ మొక్కల పెంపకానికి ప్రోత్సాహం ● వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి




# రోజుకు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం




- వాతావరణ సవాళ్లను సమర్థంగా ఎదుర్కుంటున్నాం
- దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సీఎం గాడిన పెడుతున్నారు
- వరుసగా రెండో ఏడాది ట్రూ డౌన్ అమలు చేయబోతున్నాం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి

# నదుల అనుసంధానంతోనే కరువు నివారణ

(మొదటి పేజీ తరువాయి)

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని కృష్ణా- గోదావరి జలాల పవిత్ర సంగమం వద్ద జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తుల్లో కృష్ణవేణి - గోదావరి నదుల సంగమ ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జలాలకు పుష్పమాల, వస్త్రాలు, పసుపు-కుంకుమ సమర్పించారు. కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి ఇచ్చారు. మార్చి 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణకు ఈనెలలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయ్యాయని, ఆగస్టు 14న అనకాపల్లిలో గోదావరి జలాలకు జలహారతి ఇస్తామని ప్రకటించారు. సెప్టెంబరు 1న వెలిగొండ ఫేజ్-1 ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తామన్నారు. ఎక్కడ నాకు పేరొస్తుందోనని.. నాడు పట్టిసీమ నిర్మిస్తుంటే అందరూ నన్ను విమర్శించారు. పట్టిసీమ ఒట్టిసీమ అన్నారు. విమర్శలు పట్టించుకొని ఉంటే పదేళ్లలో కృష్ణాడెల్టా ఏమయ్యేదో. వారి విమర్శలు పట్టించకోకుండా రూ.1300 కోట్లు ఖర్చు పెట్టి పట్టిసీమ పూర్తిచేశా. గోదావరి నుంచి కృష్ణానదికి 450 టీఎంసీలు తీసుకొచ్చాం. పట్టిసీమ వల్ల కరవు సీమ.. హార్టికల్చర్ హబ్‌గా తయారైంది. నీళ్లుంటే పరిశ్రమలు వస్తాయి, ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆపై ప్రముఖ ఇంజినీర్ కేఎల్ రావు 124వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. శ్రీశైలం, నాగార్జునసాగర్ లాంటి అతిపెద్ద ప్రాజెక్టుల నిర్మాణంలో కేఎల్ రావు కీలకపాత్ర పోషించారు. ఆయన విజయవాడలో జన్మించడం మన అదృష్టం. ముగ్గురు ప్రధానుల దగ్గర పనిచేసిన గొప్ప వ్యక్తి. నీళు ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు అన్నపూర్ణగా ఖ్యాతి గడించిందటే కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలే కారణం. శ్రీశైలం, నాగార్జునసాగర్ నిర్మించకుంటే ఏపీ ఇబ్బంది పడేది. ఏడాదిలో పట్టిసీమ పూర్తి చేసి కృష్ణాడెల్టాను కాపాడిన ఘనత తెలుగుదేశం పార్టీదని వివరించారు. 80 టీఎంసీలతో 13 లక్షల ఎకరాలు స్థిరీకరించాం. గోదావరి నుంచి ఏటా 2వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తాయి. ఏడాదిలో గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేసి.. కియా ఫ్యాక్టరీ ఏర్పాటు చేశాం. అమరావతిని నిర్మిస్తుంటే విమర్శిస్తున్నారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి కలిపితే అమరావతి. 99శాతానికి పైగా రైతులు అమరావతికి భూములు ఇచ్చారు. ఆగస్టు 15 నాటికి సీడ్ యాక్సిస్ రోడ్డు పూర్తవుతుంది. సీడ్ యాక్సిస్ రోడ్డులో ప్రయాణిస్తే.. అమరావతి విశిష్టత తెలుస్తుందని సీఎం అన్నారు. ఇంజినీర్‌గా కేఎల్ రావు స్ఫూర్తి ప్రతి గ్రామానికీ తీసుకెళ్లేలా ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పట్టిసీమ నుంచి గోదావరి జలాలు కృష్ణమ్మ చెంతకు చేరి ఈ డెల్టాను సస్యశ్యామలం చేస్తున్నాయన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు కృష్ణా నది నుంచి నీటి ప్రవాహం తగ్గిందని తెలిపారు. రైతులు పండించిన పంటలు తుఫాన్ల బారిన పడి నష్టపోతున్న దుస్థితి నుంచి రక్షించాలనే పట్టిసీమ ప్రాజెక్టు చేపట్టామని సీఎం వెల్లడించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ లాంటి ప్రధానమైన డ్యామ్‌ల నిర్మాణంలో కేఎల్ రావు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఐక్యరాజ్య సమితి తరఫున అంతర్జాతీయ జల నిపుణులుగా ఈజిప్ట్, సూడాన్ లాంటి దేశాల్లోనూ సేవలందించారన్నారు. విజయవాడలో పుట్టి ఎంపీగా ఎన్నికై ముగ్గురు ప్రధానుల వద్ద కేఎల్ రావు కేంద్రమంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. నీటి పారుదల రంగం, జల విద్యుత్ ఉత్పత్తి లాంటి అంశాలపై పనిచేసి దేశానికి సేవలందించారన్నారు. కేఎల్ రావు ఈ ప్రాజెక్టులను ఆధునీకరించి డెల్టాను సస్యశ్యామలం చేశారన్నారు. శివరామకృష్ణయ్య, కేఎల్ రావు తర్వాత ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగంపై ఆలోచించిన వ్యక్తి ఎన్టీఆర్ అని.. సాగునీటి రంగాన్ని తీర్చిదిద్దటంలో వీరంతా స్ఫూర్తి అంటూ వెల్లడించారు. వాగులు, వంకలు, నీటి ఊటలు కూడా ఇప్పుడు అడుగంటిపోయాయని, భూగర్భజలాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.80 టీఎంసీల గోదావరి నీటిని తీసుకువచ్చి కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేశామన్నారు. నీల వర్ణంలోని కృష్ణా జలాలు, అరుణ వర్ణంలోని గోదావరి జలాలు కలిసి ఈ ప్రాంతంలో బంగారం పండించాయని ఆనందం వ్యక్తం చేశారు. గోదావరి నుంచి కనీసం సగటున ఏడాదికి 2 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్తోందన్నారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని... రాష్ట్రానికి జీవనాడిగా మారుస్తామని స్పష్టం చేశారు. పట్టిసీమ వట్టిసీమ అని అవహేళన చేశారని.. ప్రాజెక్టు దండగ అన్నారని... ఇప్పుడు ఆ నీరే డెల్టాను కాపాడుతోందని సీఎం తెలిపారు. ఆ నీరే రాకపోతే కృష్ణా డెల్టా పరిస్థితి ఏమిటన్నది అంతా ఆలోచించాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైటెక్ సిటీ నిర్మిస్తే దండగన్నారని.. ధైర్యంగా ముందుకు వెళ్లబట్టే ఐటీకి కేంద్రంగా హైదరాబాద్ నిలబడిందని చెప్పుకొచ్చారు. ఇప్పుడు అమరావతిని కూడా అద్భుతమైన నగరంగా నిర్మిస్తుంటే కొందరు అడ్డుపడుతున్నారని మండి పడ్డారు. ప్రతిపక్షంలోని కొందరు.. రైతుల్ని రెచ్చగొట్టి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారని సీఎం చంద్రబాబు ఆరోపణలు గుప్పించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఎంపీ కేశినేని శివనాథ్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

# సమర్థవంతంగా పోక్సో చట్టం అమలు

(మొదటి పేజీ తరువాయి)

శిక్షణ అవసరమని పేర్కొన్నారు. బాధితుల వైద్య పరీక్షలను 24 గంటల్లో పూర్తి చేయాలని, ÷ూంఈఇ కిట్ల వినియోగంతో పాటు ఆఔెం, ఈ÷ూఒ నివేదికలను వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు పవన్.. ఘటన స్థలాన్ని ఫొటోలు, వీడియోలతో తప్పనిసరిగా నమోదు చేయాలని, పోక్సో కేసుల్లో దర్యాప్తు, ఛార్జిషీట్ గడువులోగా పూర్తి కావాలని పవన్ పేర్కొన్నారు. సాధారణ కేసులను 60 రోజుల్లో, క్లిష్టమైన కేసులను 90 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ కేసులను జిల్లా ఎస్పీలు, రేంజ్ ఐజీలు ప్రతి నెల సమీక్షించాలని సూచించారు. ప్రతి పోక్సో కేసులో బాధితుల రక్షణ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలని, అవసరమైతే పోలీసు పహారా, ఎస్కార్ట్ సౌకర్యం కల్పించడంతో పాటు వన్‌స్టాప్ సెంటర్లతో అనుసంధానం చేయాలని పవన్ ప్రతిపాదించారు. బెదిరింపులకు పాల్పడే లేదా నేర చరిత్ర ఉన్న నిందితులపై రౌడీషీట్లు తెరవాలని సూచించారు. పోక్సో కేసుల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (÷ాక్షఖ) విడుదల చేయాలని, జిల్లా, రేంజ్, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక పోక్సో మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసు, ప్రాసిక్యూషన్, మహిళా-శిశు సంక్షేమ శాఖల మధ్య సంయుక్త సమీక్ష సమావేశాలు నిర్వహించాలని కూడా సూచించారు. పోక్సో కేసుల్లో ప్రాథమిక విచారణ పేరుతో ఆలస్యం చేయకుండా వెంటనే ఈఎఫ్‌ఐ నమోదు చేయాలని, ఈఎఫ్‌ఐ నమోదు ఆలస్యం చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ లేఖలో పేర్కొన్నారు. అలాగే పాఠశాలలు, హాస్టళ్లు, కోచింగ్ సెంటర్లు, ప్రార్థనా మందిరాల్లో పిల్లలపై లైంగిక నేరాల నివారణకు తప్పనిసరి రిపోర్టింగ్ వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. పిల్లలపై లైంగిక నేరాలను సాధారణ పరిపాలనా అంశంగా కాకుండా అత్యంత ప్రాధాన్యంతో చూడాలని పవన్ స్పష్టం చేశారు. తాను సూచించిన చర్యల అమలుపై 30 రోజుల్లో కార్యాచరణ నివేదిక అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. పోక్సో చట్టం సమర్థవంతమైన అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి వేగవంతమైన, ఖచ్చితమైన న్యాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.

# ఆయుష్ వైద్యానికి హబ్‌గా ఆంధ్రప్రదేశ్

**విజయవాడ, మన జనప్రగతి జులై 15:** ఆయుష్ వైద్యానికి ఆంధ్రప్రదేశ్ హబ్ గా మారుస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో అత్యంత నిరాదరణకు గురైన ప్రాచీన ఆయుష్ వైద్యానికి పునరుజ్జీవం తెచ్చేందుకు రూ. 414 కోట్లతో అభివృద్ధి చర్యల్ని చేపట్టామని చెప్పారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం "ఔషధ మొక్కల స్థిరమైన సాగు, ఆర్థిక వృద్ధి, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు" అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ హాజరయ్యారు. ఆయన ప్రసంగిస్తూ ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, నేచురోపతి, హోమియోపతి) విభాగం పరిధిలో భారీ అంచనా వ్యయంతో వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. కేవలం రోగం వచ్చిన తర్వాత చికిత్స అందించే 'రియాక్టివ్?క్యూరేటివ్' విధానం నుంచి, రోగాలను ముందుగానే గుర్తించి నివారించే 'ప్రెడిక్టివ్?ప్రివెంటివ్?వెల్‌నెస్ సెంట్రిక్' ఆరోగ్య విధానం వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో ప్రాచీన ఆయుష్ వైద్య సేవల విస్తరణలో భాగంగా రూ. 280 కోట్లతో నాలుగు కొత్త ఆయుష్ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.ధర్మవరం, పిఠాపురంలలో ఆయుర్వేద వైద్య కళాశాలలు, ప్రొద్దుటూరులో యునాని కళాశాలలు రాబోతున్నాయని చెప్పారు. ఒక్కో కళాశాలకు రూ. 70 కోట్లు వ్యయం చేస్తామని చెప్పారు. ఇప్పటికే విశాఖపట్నంలో నేచురోపతి మెడికల్ కళాశాల నిర్మాణ పనులు (మొత్తం రూ. 280 కోట్లు ) పూర్తికావొచ్చాయని తెలిపారు. అదేవిధంగా తిరుపతి, గిద్దలూరు, నందిగామ, తెనాలి, టెక్కలి, రంపచోడవరంలలో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులకు ఒక్కో దానికి రూ. 90 కోట్లు వెచ్చిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 44 కోట్లతో తలపెట్టిన1,500కు పైగా ఆయుష్ డిస్పెన్సరీల ఆధునికీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. త్వరలో కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి రాష్ట్ర పర్యటనకు రానున్నారని, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, శ్రీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. మరోవైపు ప్రభుత్వ ఆరోగ్య సంస్కరణల ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు సుమారు 20 శాతం పెరిగాయన్నారు. గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 255 ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిం చడం ప్రభుత్వ వైద్య సామర్థ్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ కృషి కారణంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబిబియస్ సీట్లు భారీగా పెరుగుతున్నాయని చెప్పారు. ఔషధ మొక్కల పెంపకానికి మంచి డిమాండ్ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, నేచురోపతి వంటి భారతీయ వైద్య విధానాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఔషధ మొక్కల పెంపకం ద్వారా రైతుల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి చెప్పారు. రైతు ఉత్పత్తుల్ని విలువ ఆధారిత ఔషద మొక్కల ద్వారా డిమాండ్ పెరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అశ్వగంధ, మునగాకు, ఉసిరి వంటి ఔషధ మొక్కలకు అంతర్జాతీయంగా పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, రైతులు, విద్యార్థులు ఈ రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ముంబై ఆస్పత్రి నుంచి పవన్ డిశ్చార్జ్

### - డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపిన అన్నా లెజినోవా

**ముంబై,మన జనప్రగతి జులై 15:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రి నుంచి శస్త్రచికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. గత కొంతకాలంగా కుడి భుజం నొప్పితో బాధపడుతున్న ఆయనకు వైద్యులు విజయవంతంగా సర్జరీ పూర్తి చేయడంతో, క్షేమంగా ఇంటికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఒక భావోద్వేగ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. ఎట్టకేలకు ఆసుపత్రి నుంచి తనకు డిశ్చార్జ్ లభించిందని, తమ హృదయాలు కృతజ్ఞతతో నిండిపోయాయని అన్నా లెజినోవా పేర్కొన్నారు. తన భర్త ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఎంతో నైపుణ్యం, బాధ్యతతో ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందానికి ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆయన సురక్షితమైన చేతుల్లో ఉన్నారనే నమ్మకం తమ కుటుంబానికి ఎంతో విలువైన ప్రశాంతతను ఇచ్చిందని చెబుతూ.. చికిత్స అందించిన డాక్టర్లకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. కేవలం వైద్య నైపుణ్యానికే కాకుండా, ఈ కష్ట సమయంలో వారు చూపించిన దయ, అంకితభావం మరియు మానవత్వానికి తాము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఆమె ఆవేదనతో కూడిన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇక పవన్ కళ్యాణ్ సర్జరీ విషయానికి వస్తే, ఆయన గత 2016 నుంచి భుజం నొప్పితో బాధపడుతున్నారు. ప్రజా క్షేత్రంలో నిరంతర పర్యటనలు, వారాహి యాత్రలు మరియు ఎన్నికల ప్రచారాల సమయంలో అభిమానులు ఆయన్ని లాగడం వల్ల కుడి భుజంలోని రొటేటర్ కఫ్ కండరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనికి తోడు చిన్న ఫ్రాక్చర్ కూడా ఉండటంతో ప్రముఖ క్రీడా వైద్య నిపుణుడు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలోని బృందం సుమారు మూడున్నర గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కోలుకుంటుండగా, వైద్యులు ఆయనకు 3 వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, నిరంతర పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. దీంతో జనసైనికులు, అభిమానులు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.

# కూటమి పాలనలో రైతులకు కన్నీరు.. సిండికేట్లకు పన్నీరు : వైఎస్ జగన్

(మొదటి పేజీ తరువాయి)

గిట్టుబాటు ధర లేక రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే సిండికేట్లు మాత్రం పండుగ చేసుకుంటున్నారని విమర్శించారు. భీమవరంలో ఆక్వా రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆక్వా రైతులకు సరైన ప్రోత్సాహం లేక అనేక అవస్థలు పడుతున్నారు.ఆక్వా రైతుల పరిస్థితి దారుణంగా మారిందని, ఇష్టానుసారం ఫీడ్ ధరలు పెంచుకుంటూ పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిండికేట్లు మాత్రం పండుగ చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు సానుభూతిపరులే సిండికేట్‌గా ఏర్పడ్డారు. ఫీడ్, సీడ్ రేట్లను చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తున్నారని ఆరోపించారు. సిండికేట్స్ చేతుల్లో ఆక్వా రైతులు ఆగమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# భారత్ పెట్టుబడుల్లో 25శాతం మనరాష్ట్రానికే...

(మొదటి పేజీ తరువాయి)

దీంతో ఎంతో మందికి ఉపాధి లభిస్తోందని చెప్పారు. వైకాపా హయాంలో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ చాలా దెబ్బతిందన్నారు. మళ్లీ అభివృద్ధి స్థాయికి రాష్ట్రాన్ని తీసుకురావడానికి రెండేళ్లు అహర్నిశలు కష్టపడ్డామని చెప్పారు. రూ.3,100 కోట్లతో చేపడుతున్న ఈ పరిశ్రమ విస్తరణ పనులతో మరో 700 మందికి ఉపాధి లభించనుంది.మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నారా లోకేశ్ మరోసారి విరుచుకుపడ్డారు. జగన్ కడపకు పట్టిన క్యాన్సర్ గడ్డ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంత బాబాయి వివేకానంద రెడ్డిని చంపింది జగనే అని ఆరోజు పాదయాత్రలో చెప్పానని... ఈరోజు కూడా చెబుతున్నానన్నారు. జగన్ పార్టీ.. హిట్ అండ్ రన్ పార్టీ అంటూ దుయ్యబట్టారు. 'మాజీమంత్రి కొడుకు రోడ్డు ప్రమాదం చేసి ఒకరిని చంపితే తప్పుకాదా? కొడుకు తప్పు చేస్తే ఒక కేంద్రమంత్రి వెంటనే సరెండర్ చేశారు. మీ మాజీమంత్రి తప్పు చేస్తే.. మీరేం చేశారు? గతంలో జగన్ కారు టైర్ల కింద నలిగి ఒకరు చనిపోయారు. ఇవన్నీ వీళ్లకు చిన్న విషయాలులానే ఉంటాయి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రాహ్మణీ స్టీల్స్‌కు అప్పట్లో ఎకరాకు రూ.19 వేల చొప్పున 11 వేల ఎకరాలు కేటాయించారని మంత్రి తెలిపారు. బ్రాహ్మణీ వల్ల లబ్ది పొందింది.. గాలి జనార్దన్ రెడ్డి, జగన్ రెడ్డిలు మాత్రమే అని అన్నారు. లీగల్ ప్రాసెస్ చూసుకొని ఆ భూములను స్వాధీనం చేసుకుంటున్నామని చెప్పారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసిందేమీ లేదని విమర్శించారు. జగన్ హయాంలో 250 మంది మత్స్యకారులు చనిపోతే ఒక్కరికీ పరిహారం ఇవ్వలేదని అన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో బాధిత మత్స్యకారుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ.10 లక్షల పరిహారం ఇచ్చినట్లు తెలిపారు. జగన్ హయాంలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని.. కూటమి ప్రభుత్వ హయాంలో 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. మళ్లీ నోటిఫికేషన్లు ఇస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# తుదిదశకు అహ్మదాబాద్ విమాన దుర్ఘటన దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

కీలక పురోగతి సాధించింది. పౌర విమానయాన శాఖకు ఐదు ప్రధాన డిమాండ్లతో బాధితుల కుటుంబ సభ్యులు లేఖలు రాశారు.÷నైల్ రిపోర్ట్ ఇచ్చే ముందు స్వతంత్ర 'ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్ వాలిడేషన్ టెస్టులు' నిర్వహించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు పురోగతిపై ప్రతి 15 లేదా 30 రోజులకు ఒకసారి కుటుంబాలకు అధికారికంగా సమాచారం అందించాలని అధికారులకు కేంద్రమంత్రి సూచించారు. కేసు విచారణ బృందంలో బోయింగ్ 787 నడిపిన అనుభవం ఉన్న సీనియర్ కమర్షియల్ పైలట్‌ను చేర్చాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తు చట్టపరమైన హక్కులను కోల్పోయేలా బాధితులపై ఎలాంటి బలవంతపు ఒప్పందాల సంతకాలు చేయించవద్దని అధికారులను కేంద్రమంత్రి ఆదేశించారు. ఈ ఘటనపై తుది నివేదిక విడుదలకు ఓ కచ్చితమైన కాలపరిమితిని ప్రకటించాలని కుటుంబ సభ్యులు కోరారు. బాధితుల కుటుంబ సభ్యుల లేఖపై కేంద్రమంత్రి స్పందించారు. అంతర్జాతీయ దర్యాప్తు నిబంధనల ప్రకారమే విచారణ వేగంగా సాగుతోందని కేంద్రమంత్రి రామ్మోహన్ స్పష్టం చేశారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆమె మాట్లాడుతూ.. మహిళల భద్రత - మా బాధ్యత అంటూ అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఎన్నో పోరాటాలు వలన మహిళలకు స్వేచ్ఛ వచ్చిందని గుర్తు చేశారు. మహిళలకు ధైర్యం కల్పించడానికి.. అభయ కార్యక్రమాన్ని పోలీసులు ప్రారంభించారని తెలిపారు. చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. పిల్లలను తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని అన్నారు. కష్టపడి చదువుకొని, ఉన్నత స్థాయికి వెళ్ళాలని ఈ సందర్భంగా పిల్లలకు ఆమె సూచించారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మిమ్మల్ని ఇబ్బంది పడితే తక్షణమే 112కి కాల్ చేయాలని అన్నారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని వివరించారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకండి అంటూ పిల్లలకు హోం మంత్రి అనిత హితవు పలికారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వారికి స్పష్టం చేశారు.

# రోజుకు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం

- వాతావరణ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటున్నాం
- దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సీఎం గాడిన పెడుతున్నారు
- వరుసగా రెండో ఏడాది ట్రూ డౌన్ అమలు చేయబోతున్నాం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి, మన జనప్రగతి జులై 15:** దేశంలో ట్రూ-అప్ విధానాన్ని అమలు చేసిన ప్రభుత్వాలు ఉన్నప్పటికీ, ట్రూ-డౌన్ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గత రెండేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా మూడో ఏడాదిలోకి అడుగుపెట్టామని, ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలో వాతావరణ హెచ్చుతగ్గుల కారణంగా రోజుకు సుమారు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవుతున్నప్పటికీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. బలమైన గాలుల కారణంగా విద్యుత్ లైన్లకు తాత్కాలిక అంతరాయాలు ఏర్పడుతున్నా, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరిస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు.

గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వల్పకాలంలోనే గాడిలో పెట్టారని మంత్రి అన్నారు. ట్రాన్స్‌కోను బలోపేతం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా సాగుతోందని వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని తెలిపారు. విద్యుత్ శాఖకు సంబంధించిన ఖీబ.6,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రస్తుతం వివిధ దశల్లో అమలవుతున్నాయని, నిర్ణీత గడువులో అవసరమైన అన్ని సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.

# స్పెషల్ ఇంటర్నేటివ్ రివిజన్ సమీక్ష





**దేవనకొండ మన జనప్రగతి జులై 15:-**ఆలూరు నియోజకవర్గం ఇంచార్జి వైకుంఠం జ్యోతి  ఆదేశాల మేరకు దేవనకొండ స్పెషల్ ఇంటర్నిటీవ్ రివిజన్ పైన సమీక్షా సమావేశం మరియు ప్రతి నేల రెండవ బుధవారం నిర్వహించే సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ  ప్రక్రియలో భాగంగా సమయం తక్కువ ఉన్నందువలన మన తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు బి ఎల్ వోలు లకి సహకరించి తెలుగుదేశం సానుభూతి పరుల ఓట్లు మిస్ కాకుండా చూసుకోవాలని ఓటర్ల నమోదు లో అవకతవకలు జరగకుండా చూసుకోవాలని తెలియజేయడం జరిగింది. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి ఏ విధంగా కృషి చేయాలో దిశా నిర్దేశం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో విజయ భాస్కర్ గౌ డుమార్కెట్ యార్డ్ వైస్ చేర్మెన్ మల్లేపల్లి రంగుడు సొసైటీ చేర్మెన్ రాజశేఖర్ గౌడ్ మాజీ జడ్పీటీసీ ఉచిరప్ప  మల్లికార్జున గౌడ్ గోవింద్ గౌడ్ కప్పట్రాళ్ల మల్లికార్జున ఆకుల వీరేష్ చంద్రశేఖర్ గౌడ్ నాగరాజు గౌడ్ రాజు గోపాల్ గౌడ్ కాకర్ల శాంత కుమార్ నాగేష్ గౌడ్ బాటమీద రాజు మద్దిలేటి యండ తిమ్మయ్య పెదరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 15:-** ప్రజలందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ, మరియు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థకార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. బుధవారం కర్నూలు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, మరియు మాజీ గ్రంథాలయ చైర్మన్ గంగాధర్ రెడ్డి మరియు మెడికవర్ హాస్పిటల్, కర్నూల్  ల సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీలోని సన్ రైజ్ స్కూల్ లో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి హాజరయ్యారు.   జడ్జి మాట్లాడుతూ ఉచిత కంటి మరియు హెల్త్ చెకప్ లను చేయించుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. అనంతరం ఉచిత న్యాయ సహాయం పై ప్రజలకు అవగాహన కలిగించారు ఎవరికైనా సమస్యలు ఉంటే 15100 కాల్ చేస్తే వారి సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు. ప్రజా వినియోగ సేవల కోసం శాశ్వత లోక్ అదాలత్ ఉన్నదని తెలిపారు.పలు రంగాలకు సంబంధించిన ఎటువంటి సేవలోపంగాని నష్టం గానీ అన్యాయంగాని జరిగితే తక్షణమే శాశ్వతలో లోక్ అదాలత్, కర్నూలు  వారికి వినతిపత్రంతో పాటు తగిన ఆధారాలు సమర్పించాలని తెలిపారు.ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా అతి తక్కువ సమయంలో సత్వర న్యాయం అందజేస్తామని తెలిపారు. అనంతరం కంటి ముక్కు చెవి డాక్టర్ శశి కిరణ్, చిన్నపిల్లల డాక్టర్ సింధూర  ల ఆధ్వర్యంలో కాలనీ వాసులకు, పిల్లలు కు కంటి మరియు హెల్త్ చెకప్ లను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ గంగాధర్ రెడ్డి,ఈఎన్ టీ డాక్టర్ శశికిరణ్, చిన్న పిల్లల వైద్య నిపుణురాలు సింధూర, యునాని డాక్టర్ ఆరిఫ్ అహమ్మద్, మెడికవర్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితులు అరెస్టు



**పత్తికొండ మన జనప్రగతి జులై 15:-** పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో న్యూ బిల్డింగుల్లో ఈనెల 13వ తేదీన హత్యకు గురైన బోయ శ్రీనివాసులు చంపిన నిందితులను నలుగురును అరెస్ట్ చేశామని పత్తికొండ టౌన్ సిఐ జయన్న తెలిపారు. మంగళవారం పత్తికొండ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ  భార్య భర్త మధ్య నాలుగెకరాల పొలం విషయంలో తరచుగా గొడవపడేవారు  13వ తారీకు భార్యాభర్తల మధ్య విషయంలో నాలుగు ఎకరాల పొలంలో అమ్మి అప్పులు కట్టాలి అని అడగగా భర్తను చంపితే అప్పుల విషయం ఎత్తడు కదా అనే ఉద్దేశంతో  ఇద్దరు కూతుర్లు అల్లుడు సాయంతో బోయ శ్రీనివాసులు అక్కడ ఉన్న రాడ్లతో సుత్తితో కొట్టి గొంతును నులివి చంపారని ముద్దాయిలుఒప్పుకున్నారు,నిందితులు మంగళవారం రోజున అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన, రాట్లను కట్టె ను మరియు మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి మర్డర్ కేసును చేదించిన సిబ్బందికి డి.ఎస్.పి.వెంకట్రామయ్య  అభినందించారు.

# మంత్రి నారా లోకేష్ ఘన నివాళి

## - పుట్టా పోలమ్మ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 15:-**మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి స్వర్గీయ శ్రీమతి పుట్టా పోలమ్మకి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ ఘనంగా నివాళులర్పించారు. ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నివాసానికి విచ్చేసిన మంత్రి నారా లోకేష్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత తో కలిసి స్వర్గీయ పుట్టా పోలమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్, కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి లోకేష్, ఈ విషాద సమయంలో వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్  మాట్లాడుతూ, పుట్టా పోలమ్మ కుటుంబ విలువలు, సేవాభావం, నిరాడంబర జీవన విధానం, మానవీయతకు ప్రతీకగా నిలిచారని కొనియాడారు. ఆమె చూపిన ఆదర్శాలు, విలువలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి  సవిత, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి, బీటెక్ రవి, లింగారెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ రామ భూపాల్ రెడ్డి, లక్ష్మీ రెడ్డి గారు, పలువురు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పుట్టా పోలమ్మకి ఘన నివాళులర్పించారు.

# దాల్మియా భారత్ విస్తరణతో కడప పారిశ్రామిక రంగానికి స్వర్ణయుగం

**పరిశ్రమల శాఖామంత్రి మంత్రి టి.జి. భరత్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సీఎంఆదినారాయణ రెడ్డి**

**చంద్రబాబు దూరదృష్టి, లోకేష్ చొరవతో భారీ పెట్టుబడులు వస్తున్నాయి**

**దాల్మియా ప్రాజెక్టుతో వేలాది మందికి ఉపాధి**







**కడప మన జనప్రగతి జూలై 15:-** కడప జిల్లాలో దాల్మియా భారత్ సిమెంట్ రెండో ఉత్పత్తి విభాగం ఏర్పాటుతో పారిశ్రామికాభివృద్ధికి కొత్త అధ్యాయం ప్రారంభమైందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి. భరత్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిలు సంయుక్తంగా పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగు నియోజకవర్గం, మైలవరం మండలం చిన్నకొమర్లలో నిర్వహించిన దాల్మియా భారత్ 2వ యూనిట్ విస్తరణ పనుల శంఖుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రసంగించారు.జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, పరిశ్రమలకు అనుకూల విధానాలు, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నిరంతర సమీక్షలు, పెట్టుబడిదారులకు అందిస్తున్న పూర్తి సహకారం వల్లే ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు అత్యంత విశ్వసనీయ గమ్యస్థానంగా మారిందని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేయడం, ప్రతి ప్రాజెక్టును ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపు తీసుకొచ్చిందన్నారు.కడప జిల్లాలోని అపారమైన సున్నపురాయి నిల్వలను సద్వినియోగం చేసుకుంటూ దాల్మియా భారత్ రూ.3,100 కోట్లతో భారీ విస్తరణ చేపట్టడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టిజి భరత్ మాట్లాడుతూ... దేశంలోని ప్రముఖ సిమెంట్ సంస్థల్లో దాల్మియా భారత్ ఒకటిగా నిలిచిందని, ప్రస్తుతం 12 రాష్ట్రాల్లో 19 అత్యాధునిక తయారీ కేంద్రాలతో 5.47 కోట్ల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి దేశంలో నాలుగో అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థగా కొనసాగుతోందని వివరించారు. ఈ విస్తరణ పూర్తయిన తర్వాత కడపలోనే సంస్థకు దేశంలో అతిపెద్ద సమీకృత సిమెంట్ ఉత్పత్తి కేంద్రం ఏర్పడుతుందని తెలిపారు.పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ తక్కువ కార్బన్ ఉద్గారాలతో ఉత్పత్తి, పునరుత్పాదక ఇంధన వినియోగం, సుస్థిర పారిశ్రామికాభివృద్ధి దిశగా దాల్మియా భారత్ ముందంజలో ఉందని కొనియాడారు. 2040 నాటికి కార్బన్-నెగటివ్ సంస్థగా ఎదగాలనే లక్ష్యంతో సంస్థ పనిచేస్తుండటం  అభినందనీయమన్నారు.సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా దాల్మియా భారత్ ఫౌండేషన్ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి అవకాశాలు, మహిళల సాధికారత, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా వేలాది మంది యువతకు శిక్షణ అందించడంతో పాటు గ్రామాల సమగ్రాభివృద్ధికి సంస్థ చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ... జమ్మలమడుగు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం దిశగా దాల్మియా విస్తరణ ప్రాజెక్టు కీలక అడుగని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్ చొరవతో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో కొత్త శకానికి నాంది పలుకుతోందని, కడప జిల్లా ఆ అభివృద్ధిలో కీలక కేంద్రంగా అవతరిస్తోందని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్  జాబితాల్లోని ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలి: జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 15:-** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ జాబితాల్లోని ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లను ఆదేశించారు.బుధవారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఈఎఫ్ డిజిటైజేషన్, అన్‌కలెక్టబుల్ డేటా ఎంట్రీలు, ఏఎస్‌డీడీ నమోదు తదితర పనుల పురోగతిపై  కలెక్టర్ సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్,డూప్లికేట్ జాబితాల్లోని ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఈఆర్ఓ లను ఆదేశించారు. ఈ పనిని సమర్థంగా నిర్వహించగల అధికారులకు పోలింగ్ స్టేషన్లను కేటాయించి, ప్రతి కేసును ఆధారాలతో ధృవీకరించాలని కలెక్టర్ సూచించారు. డెత్ కేసులకు తప్పనిసరిగా మరణ ధృవీకరణ పత్రం, డూప్లికేట్ కేసులకు సంబంధిత మరో ఎపిక్ నంబర్ తప్పనిసరిగా జత చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆబ్సెంట్, షిఫ్టెడ్ కేసుల విషయంలో సంబంధిత ఇంటి పొరుగువారితో పంచనామా నిర్వహించి, వారు ఎప్పుడు, ఎక్కడికి మారారనే వివరాలను నమోదు చేసి ఆధారాలతో భద్రపరచాలని కలెక్టర్ సూచించారు. ఒకవేళ పొరపాటున ఏ.ఎస్.డి.డి కేటగిరీలో చేర్చినట్లు తేలితే, వెంటనే రోల్‌బ్యాక్ చేసి సంబంధిత ఓటరు నుంచి ఫారం స్వీకరించి తిరిగి ప్రాసెస్ చేయాలన్నారు. తద్వారా జిల్లాలో నాణ్యమైన, తప్పులులేని ఓటర్ల జాబితా రూపొందుతుందని కలెక్టర్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బుక్ ఏ కాల్  కు సంబంధించిన ఫిర్యాదులను మరియు ఆన్‌లైన్‌లో అందిన ఓటర్ల దరఖాస్తుల పరిష్కారాన్ని కూడా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను  ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న ఎన్యూమరేషన్ ఫార్మ్ డిజిటైజేషన్ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మ్యాప్ కాని ఓటర్ల వివరాలను నాలుగు రోజుల్లోగా పూర్తిగా మ్యాప్ చేయించాలని కలెక్టర్ ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లను ఆదేశించారు.జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఈ ఆర్వో లు, ఏఈఆర్ఓ లతో పోలింగ్ స్టేషన్ ల వారీగా లోతుగా సమీక్షించారు. టెలి కాన్ఫరెన్స్‌లో డిఆర్వో వెంకట నారాయణమ్మ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు  పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

**దిశా కమిటీ చైర్మన్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు.**





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 15:** జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయాలని దిశా కమిటీ చైర్మన్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు  అధ్యక్షతన నిర్వహిస్తున్న జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జడ్పీ ఛైర్మన్  ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పి. పార్థ సారథి, దిశా కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దిశా కమిటీ చైర్మన్ మరియు ఎంపీ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు చాలా తక్కువగా పడుతున్నాయని, ఈ కారణంగా ప్రస్తుత ఖరీఫ్ పై ఆశలు వదులుకునే పరిస్థితి ఉత్పన్నమైందని ఎంపీ వ్యాఖ్యానించారు. రాబోయే రబీ కి సాగునీరు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతాలు అత్యల్ప వర్షపాతం గల వర్షాధారిత ప్రాంతాలు కావడం వలన అత్యంత వెనుకబడ్డాయని, ఈ ప్రాంతాల వ్యవసాయ ఆర్థిక అభివృద్ధిపై జిల్లా యంత్రాంగం, అధికారులు మరింత శ్రద్ధ వహించాలని కోరారు. వికసిత్ భారత్ లక్ష్యంగా వీబీ జీ రామ్ జీ పథకం ప్రవేశపెట్టారని,  జిల్లాలో జాబ్ కార్డుల సంఖ్య  మరింత పెంచాలని కోరారు. అలాగే ఈ పథకం కింద ఉన్న  పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. పి ఎం కె ఎస్ వై కింద మేజర్ పనులను గుర్తించి అమలు చేయాలని కోరారు.   బిల్లేకల్లు ప్రాంతంలో కూరగాయల మార్కెటింగ్ సౌకర్యాలు పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.జిల్లాలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను కనుగొనేందుకు డయాగ్నస్టిక్స్ సౌకర్యాలు పెంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. హైదరాబాదులోని బసవతారకం క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ వారు జిల్లాలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సన్నద్ధత వ్యక్తం చేశారని, వారికి తగిన సదుపాయాలు కల్పిస్తూ, ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కలెక్టర్‌కు సూచి ంచారు.జిల్లాలో జల్‌జీవన్ మిషన్ అమలు గూర్చి ఆరా తీస్తూ, ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం వలన వర్షాలు తక్కువగా పడి, ప్రజలు త్రాగునీరుకి తీవ్ర ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి కనుక, వారికి పరిశుభ్రమైన త్రాగునీరు అందించేందుకు సంబంధిత శాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.  రోడ్ల అభివృద్ధి, మరమ్మతులను మరింత మెరుగుపరచాలని, ముఖ్యంగా ఆలూరు వద్ద త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులను ఆదేశించారు. బిల్లేకల్లు, ఆస్పరి తదితర ప్రాంతాల్లోని రహదారులు గుంతల మయంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎం.పీ ఆదేశించారు. అమరావతి మరియు వైజాగ్ ప్రాంతాలకు కర్నూలు జిల్లా వాసులకు నేరుగా కనెక్టివిటీ పెంచేలా, అలాగే మహబూబ్‌నగర్ - వైజాగ్ ట్రైన్ పొడిగింపు కు  తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పంచలింగాల ఆలయ పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమం



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 15:-** సిద్ధవటం మండలం వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజయ్య కోన పంచలింగాల ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఎండోమెంట్ ఈవో సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించి, పరిశుభ్రత చర్యల్లో భాగంగా బ్లీచింగ్ పిచికారీ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు, లంకమల అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణకు కూడా ఈ చర్యలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది చంద్రతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ



**దేవనకొండ మన జన ప్రగతి జులై 15:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ దేవనకొండ మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సుభిక్షం చేకూరాలని ప్రార్థించారు. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా వర్షాలు బాగా కురుసాలని అమ్మవారిని వేడుకుంటున్నారు.

## సీఎం సహాయనిధి లబ్ధిదారులకు ఒక గొప్ప వరం: ఎమ్మెల్యే ఆర్వ శ్రీధర్



**ఓబులవారిపల్లి మన జనప్రగతి జూలై 15 :-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం సహాయ నిధి లబ్ధిదారులకు ఒక గొప్ప వరమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మరియు కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జి ముక్కారూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి అన్నారు బుధవారం తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట మండలంలోని అనంతసముద్రం కే వడ్డిపల్లి తదితర ప్రాంతాల పంచాయతీలలో కూటమి నాయకులతో సహా సుడిగాలి పర్యటన చేపట్టి సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులు ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. ముందు ముందు అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన లబ్ధిదారులు వారికి సంబంధించిన బిల్లులను ముక్క వారి పల్లి ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు తీసుకువస్తే ఆ ఆబిల్లులను విజయవాడకు సీఎం సహాయ నిధి కొరకు దరఖాస్తు చేయించి అర్హులేని ప్రతి ఒక్కరికి సీఎం సహాయనిధి అందేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. మండల టిడిపి నాయకులు చంద్రశేఖర్ నాయుడు ముద్ద సుభాష్ రెడ్డి వెంకటరమణ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సీఎం సహాయనిధి సిక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మీలు

**ఓబులవారిపల్లి మన జనప్రగతి జూలై 15 :-** ఓబులవారిపల్లి మండలం చిన్నోరంపాడు మరియు ముక్క వారి పల్లి పంచాయతీలలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మరియు టిడిపి ఇన్చార్జి ముక్కరూపానంద రెడ్డి సతీమణి మొక్క వరలక్ష్మిలు సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం పెద్ద వరం పాడు చిన్న బోరంపాడు ముక్క వారి పల్లి. గొబ్బూరు వారి పల్లి తదితర పంచాయతీలలో దాదాపు పది లక్షల రూపాయలు పైనే చెక్కులను 15 మందికి పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మండల కూటమినాయకులు వాసుదేవ రెడ్డి కోటి నాయుడు గజేంద్రనాయుడు శంకరయ్య తదితర కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## బాల గృహాలకు తప్పనిసరిగా "అభయ శరణాలయం" నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలి

**● ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రమాదేవి**

**కడప అర్బన్ మన జనప్రగతి జూలై 15 :-** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో నడుస్తున్న 18 ఏళ్ల లోపు బాల బాలికల నివాస గృహాలకు తప్పనిసరిగా "అభయ శరణాలయం" అనే పేరుపలక (నేమ్ బోర్డు) లను ఏర్పాటు చేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి (ఐసీడీఎస్ పీడీ) రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువెనైల్ జస్టిస్ (బాలల సంరక్షణ, పరిరక్షణ) చట్టం2015 ప్రకారం జిల్లాలోని బాల గృహాలు, బాల సంరక్షణ సంస్థలు తమ సంస్థల పేరుపలకలను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు. 18 ఏళ్ల లోపు పిల్లలను నివాసంగా ఉంచి సంరక్షణ కల్పిస్తున్న ఏ సంస్థ అయినా జిల్లా జువెనైల్ జస్టిస్ బోర్డు, జిల్లా శిశు సంక్షేమ కమిటీ, జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి కార్యాలయాన్ని సంప్రదించి అవసరమైన అనుమతులు పొందాలన్నారు. అనుమతులు లేకుండా బాలల సంరక్షణ కేంద్రాలను నిర్వహించడం జువెనైల్ జస్టిస్ చట్టం2015లోని సెక్షన్42 ప్రకారం శిక్షార్హమైన నేరమని, అలాంటి సంస్థల నిర్వాహకులకు ఒక సంవత్సరం వరకు జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత: జానం సుజాత



**కలికిరి, మన జనప్రగతి జూలై 15:-** స్థానిక ఇందిరమ్మ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా బుధవారం ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని జరిగింది. ఈ కార్యక్రమానికి అతుల్ లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యత లో భాగంగా వివిధ రకాలైన సుమారు 150 మొక్కలను ఉచితంగా అందజేసింది. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని జానం సుజాత మాట్లాడుతూ, ప్రకృతిని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పర్యావరణంపై అవగాహన పెంపొందించుకొని ప్రతి సంవత్సరం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. పాఠశాలకు వివిధ రకాలైన 150 మొక్కలను ఉచితంగా అందజేసిన అతుల్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ రెడ్డి మోహన్ రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకాన్ని ఉద్యమంలా కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అతుల్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు దేవా, డోనాల్డ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


## శిథిలావస్థలో గొల్లపల్లి ప్రభుత్వ పాఠశాల... విద్యార్థుల్లో ఆందోళన





**సిద్ధవటం, మన జనప్రగతి జూలై 15:-** సిద్ధవటం మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరగతి గదుల పైకప్పు పెచ్చులు ఊడి కింద పడుతుండటంతో పాటు, వర్షం కురిసినప్పుడు గదుల్లోకి నీరు చేరి బోధనకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. మరుగుదొడ్ల సౌకర్యం కూడా సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేష్ మాట్లాడుతూ, విద్యార్థుల భద్రత దృష్ట్యా భవనానికి తక్షణమే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ, పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలంటేనే భయంగా ఉందని, ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించలేకపోతున్నామని వాపోయారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో గొల్లపల్లి పాఠశాల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై మండల విద్యాశాఖాధికారి ఆవుల అరుణను వివరణ కోరగా, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు పనులు ప్రారంభిస్తామని ఆమె వెల్లడించారు.

## దళితుల భూమిలో అక్రమ మట్టి తవ్వకాలపై రైతుల ఆందోళన



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 15:-** సిద్ధవటం మండలం పెద్దపల్లె గ్రామ పరిధిలోని సర్వే నం. 937లో అక్రమంగా మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయని దళిత రైతులు ఆరోపించారు. రైల్వే పనుల కోసం మట్టి త ె వ్వ ం ద ు క ు కేటాయించిన సర్వే నం. 1163లో కాకుండా, దళితులకు చెందిన కోర్టు వివాదంలో ఉన్న భూమిలో హిటాచీ యంత్రాలతో తవ్వకాలు నిర్వహించి టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన మాధవరం-1 హరిజనవాడకు చెందిన ఎస్సీ రైతులు పనులను అడ్డుకుని నిలిపివేశారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మట్టి తవ్వకాల వెనుక సంబంధిత గుత్తేదారుకు రాజకీయ అండదండలు ఉన్నాయా అనే అనుమానాన్ని కూడా రైతులు వ్యక్తం చేశారు. ఘటనపై అధికారులు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## కరమలవారిపల్లిలో మంత్రి నారా లోకేష్ 91వ రోజు ప్రజాదర్బార్

**● ప్రజలను కలిసి వివిధ సమస్యలపై వినతులు స్వీకరణ**



**జమ్మలమడుగు మన జనప్రగతి జూలై 15:-** కడప జిల్లా మైలవరం మండలం కరమలవారిపల్లిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 91వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వారి నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖకు కేటాయించిన పోస్టులలో ఖాళీగా ఉన్న 520 డైరెక్ట్ రిక్రూట్ మెంట్ ఏఈ పోస్టులను మండల ఇంఛార్జ్ లతో భర్తీ చేయాలని హౌసింగ్ ఏఈ, ఎంఐసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల పరిధిలోని అర్బన్ లోకల్ బాడీస్ నుంచి గత మూడు సంవత్సరాల లైబ్రరీ సెస్ మొత్తాన్ని జమచేయడం, ఆలస్యం అయిన సెస్ పై సర్వీస్ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. కడప పట్టణంలోని జవహర్ బాల భవన్ లో పనిచేస్తున్న సిబ్బందికి టైమ్ స్కేల్ కల్పించాలని బాలభవన్ పర్యవేక్షకురాలు జి.సునీత కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## మంత్రి నారా లోకేష్‌ను కలిసిన కుప్పాల వెంకటసుబ్బయ్య



**సిద్ధవటం:మన జనప్రగతి, జూలై 15:** కడప జిల్లా పర్యటన సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిసి పలు స్థానిక సమస్యలు, పార్టీ వ్యవహారాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిద్ధవటం మండలం బొగ్గుడివారిపల్లె గ్రామంలోని తన నివాసంలో బుధవారం కుప్పాల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి నారా లోకేష్‌తో సమావేశమయ్యామని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి సూచించినట్లు వెంకటసుబ్బయ్య వెల్లడించారు.

## 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో రైతులకు వ్యవసాయ సూచనలు



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 15: –** సిద్ధవటం మండలం పొన్నవోలు గ్రామంలో బుధవారం "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి కే. రమేష్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి పలు వ్యవసాయ సంబంధిత సందేహాలను నివృత్తి చేశారు. అన్నదాత సుఖీభవ, పీఎం-కిసాన్ పథకాల అమలు విధానాలను రైతులకు వివరించారు. గ్రామంలో వరి ప్రధాన పంట కావడంతో వరి సాగులో గట్లు వెడల్పుగా ఉంచడం, కాలిబాటలు ఏర్పాటు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అలాగే సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పొలాల్లో నల్లి పురుగు, పాముపొడ తెగులు లక్షణాలు గమనించామని పేర్కొంటూ, నల్లి నివారణకు ప్రొపర్‌గైట్ 2 మి.లీ., పాముపొడ తెగులు నివారణకు వాలిడామైసిన్ 2 మి.లీ.ని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వై. ప్రభాకర్ రెడ్డి, వీహెచ్‌ఏ హసీనా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## జూనియర్ ఎన్టీఆర్ పేరుతో వైసీపీ రాజకీయ డ్రామా

**- రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ సమన్వయ కర్త అతికారి కృష్ణ**



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 15:** కూటమి ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వైసీపీ కొత్త రాజకీయ ప్రయోగాలకు పాల్పడుతోందని రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ ఆరోపించారు. బుధవారం సిద్ధవటం ఆకులవీధిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతిలో జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశం పేరుతో మీడియా సమావేశం నిర్వహించడం వెనుక వైసీపీ పాత్ర ఉందని ఆయన విమర్శించారు. దీనిపై జూనియర్ ఎన్టీఆర్ కార్యాలయం ఇప్పటికే తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టమైన ప్రకటన విడుదల చేసిందని గుర్తుచేశారు. ప్రజల్లో గందరగోళం సృష్టించి కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో వైసీపీ ఇలాంటి ప్రచారాలకు దిగుతోందని అన్నారు. అయితే జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నేతలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఓటరు జాబితాల్లో అక్రమంగా చేర్చిన దొంగ ఓట్లను అధికారులు పరిశీలించి తొలగిస్తున్నారని అతికారి కృష్ణ పేర్కొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక



## కాపు నేత ముద్రగడ పద్మనాభంకు ఘన నివాళి



**కడప మన జనప్రగతి జూలై 15:**నగరంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నందు ఎన్ఆర్ఐ ట్రస్ట్ చైర్మన్ తోట కృష్ణ, నగర యువజన అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, శివ ప్రసాద్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం గొప్ప విలువలు ఉన్న నాయకుడని తెలిపారు. ఒక మాట ఇస్తే ఆ మాట కోసం ఎంత దూరమైనా వెళ్తారని నిరూపించారు అన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీ, మంత్రిగా పని చేసి ,పదవుల కన్నా జాతి ప్రయోజనం ముద్దు అని చెప్పిన గొప్ప నాయకుడని అన్నారు. ఎవరైనా కిర్లంపూడి కి పోతే అంత స్థాయిలో ఉండి కూడా స్వయంగా ఆహారము గాని, ఆదిత్యం కానీ ఇస్తాడని తెలిపారు. ఆహారని స్వయంగా తన చేతులతో వెళ్లిన నాయకులకు వడ్డిస్తారని అంతటి గొప్ప నేతను మేము ఇంతవరకు చూడలేదని తెలిపారు. అనారోగ్యంతో హాస్పిటల్లో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి ధైర్యాన్ని ,కావాల్సిన అన్ని సౌకర్యాలను ప్రతిరోజు అందించాలని తెలిపారు .ముద్రగడ పద్మనాభం లేని లోటు కాపు, ఒంటరి, బలిజ కులస్తులకు తీరని లోటని వారు తెలిపారు 2024 ఎన్నికల్లో వైఎస్ఆర్ పార్టీకి ఎంతో సేవ చేశారని తెలిపారు .ఆయన బడుగు ,బలహీన ,అణగారిన, వర్గాలకు పని చేసి వారి హృదయాలలో చెదరని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, యానాదయ్య, పులి సునీల్ కుమార్ ,మాజీ మేయర్ పాక సురేష్, బండి నిత్యానంద రెడ్డి, రహీం, రాయల్ బాబు, పోలిదాసు కృష్ణమూర్తి, త్యాగరాజు, షఫీ ,కిరణ్ , పత్తి రాజేశ్వరి,శివమ్మ ,తదితర నాయకులు పాల్గొన్నారు

## విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం అండ

**• తొలి విడతలో 10 మందికి ట్రైసైకిళ్ల పంపిణీ**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూలై 15:**-విభిన్న ప్రతిభావంతుల స్వయం సంచారం, జీవనోపాధి మెరుగుదల, సమాజంలో ఆత్మవిశ్వాసంతో జీవించే అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి విభిన్న ప్రతిభావంతుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు.బుధవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పి. పార్థసారథి కలిసి జిల్లాకు చెందిన 10 మంది విభిన్న ప్రతిభావంతులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ట్రైసైకిళ్లను అందజేసి వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 110 మంది విభిన్న ప్రతిభావంతులు వీల్ ట్రైసైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం తొలి విడతలో 10 మందికి ట్రైసైకిళ్లు అందజేశామని, మిగిలిన 90 ట్రైసైకిళ్లను కూడా త్వరలోనే పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వారికి అవసరమైన సహాయక పరికరాలు, ఉపాధి అవకాశాలు, విద్య, సంక్షేమ పథకాల ద్వారా అన్ని విధాలా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ట్రైసైకిళ్ల పంపిణీ ద్వారా లబ్ధిదారులు స్వతంత్రంగా తమ పనులు చేసుకునే అవకాశం కలుగుతుందని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులతో ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల మరియు వయో వృద్ధుల సహాయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ రాయస్ ఫాతిమా, విభిన్న ప్రతిభావంతులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే నాబార్డు లక్ష్యం: ఫృధ్వి




**పీలేరు మన జనప్రగతి జూలై 15:** - గ్రామీణాభివృద్ధికి, ముఖ్యంగా రైతుల ఆర్థికాభివృద్ధి, జీవనోపాధి మెరుగుదలకు నాబార్డు గత 45 సంవత్సరాలుగా విశేష కృషి చేస్తోందని నాబార్డు అన్నమయ్య జిల్లా అభివృద్ధి అధికారి ఫృధ్వి పేర్కొన్నారు. నాబార్డు 45వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఆర్ఐ సంస్థ ఆధ్వర్యంలో పీలేరు మండలం మద్దెలచెరువు వాటర్‌షెడ్ పరిధిలోని గోళ్ళతోపు శ్రీ అంకాలమ్మ కళ్యాణ మండపంలో వాటర్‌షెడ్ కమిటీ సభ్యులు, రైతులు, రైతు కూలీలకు వాటర్‌షెడ్ కార్యక్రమాల ఆవశ్యకత, అమలు విధానాలపై మంగళవారం అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి ఫృధ్వి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన అభివృద్ధి కోసం నాబార్డు ఎన్నో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా రైతుల ఆదాయాన్ని పెంచడం, సహజ వనరుల పరిరక్షణ, నేలనీటి సంరక్షణ, వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, మహిళా సంఘాల సాధికారత వంటి రంగాల్లో నాబార్డు అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని వివరించారు. రైతులు ప్రభుత్వ, నాబార్డు ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అన్నమయ్య జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ, రైతుల ఆర్థికాభివృద్ధిలో బ్యాంకుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. రైతులకు అవసరమైన రుణాలు, ప్రభుత్వ పథకాల అమలు, వ్యవసాయ ఆధారిత ఉపాధి అవకాశాల కల్పనలో బ్యాంకులు కీలకంగా పనిచేస్తున్నాయని తెలిపారు. రైతులు బ్యాంకింగ్ సేవలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.సీఆర్ఐ సంస్థ పీలేరు అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, నాబార్డు సహకారంతో మద్దెలచెరువు వాటర్‌షెడ్ పరిధిలో చేపట్టిన నేల, నీటి సంరక్షణ, భూమి అభివృద్ధి, వర్షపు నీటి నిల్వ, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రతి రైతు ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వాటి ప్రయోజనాలను పొందినప్పుడే నాబార్డు 45 సంవత్సరాల సేవలకు నిజమైన ఫలితం దక్కుతుందన్నారు.వాటర్‌షెడ్ కార్యక్రమాల ద్వారా భూసార పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు, సాగు విస్తీర్ణం పెరుగుదలతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని నిపుణులు వివరించారు. కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు, సాంకేతిక అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ కమిటీ అధ్యక్షులు సుదాకర్ రెడ్డి, కమిటీ సభ్యులు వెంకట రమణ నాయుడు, ఇతర సభ్యులు, రైతులు, రైతు కూలీలు, మహిళలు, సీఆర్ఐ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 60 మంది ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని వాటర్‌షెడ్ కార్యక్రమాలపై అవగాహన పొందారు.

## ట్రిపుల్ ఐటీ అధ్యాపకునికి ప్రపంచస్థాయి గుర్తింపు

**• ఆర్జీయూకేటి ఛాన్సలర్ అభినందనలు**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 15:**- ఆర్కేవ్యాలి ట్రిపుల్ లో ఐటి మెంటార్ గా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకుడు జ్ఞాన వెంకట్ కుమార్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించారు. జులై 6-8 తేదిల్లో కౌలాంలంపూర్ లో 39వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇండస్ట్రీయల్, ఇంజనీరింగ్ అండ్ అదర్ అప్లికేషన్ ఆఫ్ అప్లైడ్ ఇంటలిజెంట్ సిస్టమ్స్ లో పాల్గొన్నారు. తన పరిశోధనలను క్వైరి-గైడెడ్ కాంటాక్ట్స్, అవేర్ మల్టీ మోడల్ అటెన్షన్ ఫ్రేమ్ వర్క్ ఫర్ ట్రాఫిక్ సర్వైవలెన్స్ విడియో క్యాప్చరింగ్ అనే అంశం ద్వారా కాన్ఫరెన్స్ లో ప్రజెంటేషన్ ఇచ్చారు. దీంతో ఆయన పరిశోధనలకు బెస్ట్ ప్రజెంటేషన్ అవార్డు లభించింది. ఆర్జీయూకేటి ఖ్యాతిని అంతర్జాతీయ వ్యాప్తి చేసిన అధ్యాపకుడు జ్ఞాన వెంకట్, స్టూడెంట్ కావ్య, వీరికి గైడ్ ఇచ్చిన ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ పరిపాలన అధికారి డా.రవికుమార్ లను ఆర్జీయూకేటి కులపతి ఆచార్య మధుమూర్తి, ఉప కులపతి ఆచార్య లక్ష్మీ నారాయణ, రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్ర కుమార్, ఆర్కేవ్యాలి డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్ లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ సందర్భంగా ఆర్కేవ్యాలి డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్ మాట్లాడుతూ క్యాంపస్ లోని ఇతర అధ్యాపకులు అంతర్జాతీయ గుర్తింపు లభించే అంశాలపై పరిశోధనలు చేయాలని సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలే విద్యా సంస్కరణలకు కేంద్రబిందువు

**• దొరసానిపల్లి జెడ్పీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి నారా లోకేష్ • విద్యార్థులతో ముఖాముఖి.. • లెర్నింగ్ అవుట్‌కమ్స్, హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా • 4 స్టార్ రేటింగ్ లక్ష్యంగా పనిచేయాలని సూచన**





**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి జూలై 15:**- విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కడప జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల అభ్యసన ఫలితాలు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు.పదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడిన మంత్రి, "సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు" నాణ్యత, మధ్యాహ్న భోజనం, చదువుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యతో పాటు శారీరక వ్యాయామం కూడా ఎంతో అవసరమని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా "మీకు మంచి మార్కులు వస్తేనే నాకు కూడా మంచి మార్కులు వస్తాయి. నా భవిష్యత్ మీపై ఆధారపడి ఉంది" అంటూ విద్యార్థులను ఉద్దేశించి మంత్రి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పుస్తకాలు, యూనిఫాం, షూలు, "తల్లికి వందనం" వంటి పథకాల ద్వారా విద్యార్థులకు అన్ని విధాలా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల లెర్నింగ్ అవుట్‌కమ్స్‌లో 1.3 స్టార్ రేటింగ్ రావడంపై ప్రిన్సిపాల్ ఏ. ధనలక్ష్మిని ప్రశ్నించిన మంత్రి, వచ్చే ఏడాదిలో మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్‌లపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ఎంఈవోలు ప్రతి 15 రోజులకు ఒకసారి పాఠశాలల పనితీరును సమీక్షించాలని ఆదేశించారు.విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని, అనుమతి లేకుండా గైర్హాజరయ్యే పరిస్థితులను నివారించాలని సూచించారు. అలాగే విద్యార్థుల డ్రాప్‌అవుట్స్‌ను అరికట్టేందుకు ప్రతి విద్యార్థిని నిరంతరం ట్రాక్ చేయాలని అధికారులకు ఆదేశించారు.గత ఏడాదితో పోలిస్తే పాఠశాల విద్యా ఫలితాలు మెరుగుపడటాన్ని మంత్రి అభినందించారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న "ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్" విజయవంతం కావాలంటే ఉపాధ్యాయులు, అధికారులు, తల్లిదండ్రులు అందరూ సమిష్టిగా కృషి చేయాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాదికి లెర్నింగ్ అవుట్‌కమ్స్‌లో 4 స్టార్ రేటింగ్ సాధిస్తామని పాఠశాల ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఫోటోలు దిగారు.

## రామాచారి కుటుంబానికి వైకాపా 2లక్షల ఆర్థిక సాయం

**- వైయస్ జగన్ ఆదేశాలతో ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి చేయూత**



**లింగాల మన జనప్రగతి జూలై 15:**-మండల పరిధిలోని లోపట్నూతల గ్రామంలో గత నెల 25వతేది వ్యక్తిగత కక్షలు కారణంగా సృజన, రామాచారి దంపతులకు చెందిన చిన్నారి నిత్విక(4) అనే పాపను ఇంటి పక్కన ఉన్న స్వాతి అనే మహిళ నీటి డ్రమ్ములో ముంచి హత్య చేసిన విషయం విధితమే. ఈ సంఘటన అప్పట్లో సంచలనంగా మారింది. నాలుగు సంవత్సరాల పాప మృతి చెందడంతో లో పట్నూతల గ్రామం తో పాటు రాష్ట్రవ్యాప్తంగా విషాదం చోటుచేసుకుంది. సంఘటనపై పలు రాజకీయ పార్టీలు, కుల సంఘాలు నిందితులకు కఠిన శిక్ష పడాలని ఆందోళన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ సంఘటనపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అప్పట్లో దిగ్భ్రాంతిని వ్యక్తం చేయడం జరిగింది. అంతేకాకుండా ఇటీవల కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నిత్విక కుటుంబాన్ని కలిసి ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. భవిష్యత్తులో పాప హత్య పట్ల చిన్నారి తల్లిదండ్రులు చేసే నాయపోరాటానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామన్నారు. అందులో భాగంగా బుధవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి లింగాల మండలం వైఎస్ఆర్సిపి నాయకులు మండల కన్వీనర్ అంబకపల్లి బాబురెడ్డి , రైతు విభాగం జిల్లా కార్యదర్శి సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు నాగేంద్ర రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గ్రామ నాయకులు వెంగల్ రెడ్డి, ప్రతాపరెడ్డి, బాబు రెడ్డి, శివారెడ్డి, కొండప్ప చేతుల మీదుగా రెండు లక్షల ఆర్థిక సహాయాన్ని నిత్విక తల్లిదండ్రులకు అందజేశారు. అంతేకాకుండా భవిష్యత్తులో అన్ని విధాలుగా అండగా ఉంటామని పాప తల్లిదండ్రులకు తెలిపారు.

## రీ సర్వే పూర్తి అయిన వెంటనే పాసుబుక్కులు పంపిణీ చేస్తాం



**చిట్వేలి మన జనప్రగతి జూలై 15:**- చిట్వేలి మండలంలో రీ సర్వే పూర్తి అయిన వెంటనే రైతులకు పాస్ బుక్కులు మంజూరు చేస్తామని చిట్వేలి మండల రెవెన్యూ అధికారి నరసింహారావు తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు టంగుటూరి. చంద్ర అధ్యక్షతన ఎంపిపి సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వైద్య.. ఆరోగ్యం, త్రాగునీరు, పారిశుద్యం, పశుపోషణ, వ్యవసాయం, రెవిన్యూ, ఉపాధి, పి ఆర్, విద్యుత్ శాఖలకు సంబంధించిన అంశాలను అజెండా గా చేపట్టి శాఖల వారీగా సమీక్షించారు. జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని అధికారులు సభకు వివరిస్తూ సభ్యుల ప్రశ్నలకు అదికారులు సావధానంగా సమాధానాలు ఇచ్చారు. తహసీల్దార్ నరసింహ రావు మాట్లాడుతూ సర్ కార్యక్రమాన్ని పూర్తిగా ముగించామని, రెవిన్యూ పరమైన సమస్యలను పరిష్కరించడంలో తమవంతు కృషి చేస్తున్నామన్నారు. ఎంపిడిఓ శ్రీనివాసులు మాట్లాడుతూ సభ్యులకు ఇది చివరి సమావేశం అని తెలిపారు. మండల అభివృద్ధిలో వారు భాగస్వాములై అధికారులకు సహకారం అందించడం సంతోషంగా ఉందంటూ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎల్వి. మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రెడ్డి, కో... ఆప్షన్ సభ్యులు అన్వర్ భాషా, ఎంపిటిసిలు నాగార్జున, కృష్ణయ్య, రాజేశ్వరి, రామలక్షుమ్మ, సుబ్బమ్మ, డిప్యూటి ఎంపిడిఓ. అనిల్ కుమార్ రెడ్డి, పి ఆర్ డి ఇ. అజయ్, ఏఈ గిరిధర్, సుధాకర్, వెంకటాచలపతి, ఏ ఓ. సుధాకర్, డాక్టర్ శివప్రసాద్ గౌడ్, ఏ పి ఎం. చంద్రకళ, ఉద్యానశాఖ అధికారి లోకేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు వసుంధర, సురేఖ రాణి, పంచాయితీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ముద్రగడ పద్మనాభం భౌతికకాయానికి నివాళులర్పించిన మంత్రులు కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్



**కిర్లంపూడి, మన జనప్రగతి, జూలై 15:**-మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు ముద్రగడ పద్మనాభం భౌతికకాయానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘన నివాళులర్పించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా కిర్లంపూడికి చేరుకున్న మంత్రులు ముద్రగడ నివాసంలో ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ముద్రగడ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## గువ్వలచెరువు ఘాట్ వద్ద అంతరాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

**- 4 కిలోల గంజాయి స్వాధీనం ముగ్గురు అరెస్ట్**



**రామాపురం మన జనప్రగతి జులై 15:**- రా మాపురం పో లీసుల కీలక ఆపరేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు ప్రధాన నిందితులు బోడన్నా (విశాఖపట్నం), ఖాదర్ బాషా (రాయచోటి), పరిమల ప్రకాష్ (బీహార్)లను గువ్వలచెరువు ఘాట్ వద్ద అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 4 కిలోల గంజాయి, ఒక బైక్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విశాఖలో గంజాయి కొనుగోలు చేసి బెంగళూరులో 'పోర్టర్' యాప్ ద్వారా అక్రమంగా విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని జిల్లా ఎస్పీ ధీరజ్ రాయచోటిలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు.గంజాయి, మాదకద్రవ్యాలపై సమాచారం ఉంటే వెంటనే 100/112 లేదా టోల్ ఫ్రీ 1972కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. కేసును ఛేదించిన డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్, సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ కె.బి. శివకుమార్‌తో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. దీనికి గాను రామాపురం ఎస్ఐ శివకుమార్ ఎస్పీ చేతుల మీదుగా క్యాష్ అవార్డు అందుకున్నారు.

మనజనప్రగతి

16 - 07 - 2026

# పారిశుద్ధ్య కార్మికులకు ఆర్థిక అక్షరాస్యత, సామాజిక భద్రతా పథకాలపై అవగాహన

**చెన్నూరు, మన జన ప్రగతి ,జూలై 15:** చెన్నూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కెనరా బ్యాంకు ఫైనాన్షియల్ లిటరసీ సెంటర్ ఎఫ్ ఎల్ సి కడప మరియు వీడియోస్ ఎన్జీవో సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరస సి ఎఫ్ ఎల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఆర్థిక అక్షరాస్యత, సామాజిక భద్రతా పథకాలు మరియు సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చెన్నూరు మండల అభివృద్ధి అధికారి బి. కిరణ్ మోహన్ రావు మాట్లాడుతూ, ప్రతి పారిశుద్ధ్య కార్మికుడు ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని, కుటుంబ సభ్యుల భవిష్యత్తు కోసం బీమా, పెన్షన్ పథకాలలో తప్పనిసరిగా చేరాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు ఖాతాలకు నామినేషన్ నమోదు చేయించుకోవడం, కేవైసీ వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజ నా అటల్ పెన్షన్ యోజన నామినేషన్, కేవైసీ అప్డేట్, అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్ "మీ డబ్బు మీ హక్కు" కార్యక్రమం గురించి సవివరంగా వివరించారు.అలాగే ప్రస్తుతం పెరుగుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాలు, మనీ మ్యూల్ అకౌంట్ మోసాలు, ఏపీకే ఫైల్ మోసాలు, పెట్టుబడి మోసాలు, ఓటిపి మోసాలు వంటి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులతో బ్యాంకు వివరాలు, ఓటిపి పిన్ను పాస్‌వర్డ్‌లు పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులు లేదా ఏపీకే డౌన్‌లోడ్ చేయవద్దని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గారు, డిప్యూటీ ఎంపీడీవో గారు, చెన్నూరు గ్రామపంచాయతీ పంచాయతీ అభివృద్ధి అధికారి పాల్గొన్నారు. అలాగే కౌన్సిలర్లు శ్రీ బి. ప్రసాద్ గారు మరియు శ్రీ వీర ప్రసాద్ ప్రసంగిస్తూ, పారిశుద్ధ్య కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు

# ప్రపంచం గర్వించదగ్గ గానకోకిల ఎస్. జానకి: మంత్రి కందుల దుర్గేష్





**విజయవాడ, మన జనప్రగతి, జూలై 15:-** ప్రపంచ ప్రఖ్యాత గాయని ఎస్. జానకి భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె గాత్రం చిరస్థాయిగా మారుమ్రోగుతూనే ఉంటుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.విజయవాడలో నిర్వహించిన ఎస్. జానకి స్మృత్యంజలి కార్యక్రమం, వందేమాతరం 150 సంవత్సరాల వేడుకల్లో పాల్గొన్న మంత్రి జానకి చిత్రపటానికి నివాళులర్పించి వందేమాతరం గీతాన్ని ఆలపించారు.దాదాపు 17 భాషల్లో 48 వేలకుపైగా పాటలు పాడిన ఎస్. జానకి తెలుగు జాతికి గర్వకారణమని, ఆమె మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటని పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎన్నో పురస్కారాలు అందుకున్న ఆమె గాత్రం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.వందేమాతరం గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో దేశభక్తిని రగిలించిందని, యువతలో జాతీయ భావన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని మంత్రి పిలుపునిచ్చారు.అనంతరం గుమ్మడి గోపాలకృష్ణ, ఎస్.పీ. భారతిని మంత్రి సత్కరించి, కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు ఎస్.పీ. భారతి, ఏపీ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు అంబటి మధుకృష్ణ తదిత రులు పాల్గొన్నారు.


# రొయ్యల రైతుల సంక్షేమమే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత

## ● రొయ్యల సాగు రంగంలో పారదర్శకత, శాస్త్రీయ విధానాలతో స్థిరత్వం తీసుకొస్తాం: మంత్రి అచ్చెన్నాయుడు




**అమరావతి మన జనప్రగతి, జూలై 15:-** రాష్ట్రంలోని రొయ్యల రైతుల సంక్షేమాన్ని పరిరక్షించడం కూటమి ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రొయ్యల ఫీడ్ ధరలు, రొయ్యల కొనుగోలు ధరలు, ఆక్వాకల్చర్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై రైతులు, ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు, ఎగుమతిదారులు, శాస్త్రవేత్తలు, సంబంధిత శాఖల అధికారులతో బుధవారం పెనమలూరు లోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు సంక్షేమానికే పెద్దపీట వేస్తుందని, ముఖ్యంగా రొయ్యల రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు శాశ్వత పరిష్కారాల అమలుకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. ఈ లక్ష్యంతో అన్ని వర్గాల భాగస్వాములతో నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తూ, ఆచరణ సాధ్యమైన, శాస్త్రీయ ఆధారిత విధానాలను రూపొందించాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. రొయ్యల ఫీడ్ ధరల నిర్ణయంలో పూర్తి పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ముడి పదార్థాల వాస్తవ ధరలు, శాస్త్రీయ ప్రమాణాలు, నిపుణుల సిఫార్సుల ఆధారంగా ఫీడ్ ధరలను నిర్ణయించే పారదర్శక విధానాన్ని అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, వాస్తవ పరిస్థితులపై రైతులకు ఎప్పటికప్పుడు సరైన సమాచారం అందించాలని, అపోహలు, తప్పుడు ప్రచారానికి తావులేకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. రొయ్యల సాగు వ్యయాన్ని తగ్గించేందుకు అవసరమైన విధానపరమైన అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో నిరంతర సమన్వయం కొనసాగించాలని సూచించిన మంత్రి, ఫీడ్ తయారీలో కీలకమైన సోయాబీన్ మీల్ దిగుమతులు, దేశీయంగా ఫిష్ మీల్ లభ్యత పెంపు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర ప్రతిపాదనలు పంపి అవసరమైన విధానపరమైన మద్దతు పొందేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఆక్వాకల్చర్ రంగం ప్రపంచస్థాయిలో మరింత పోటీతత్వాన్ని సాధించాలంటే రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ యంత్రాంగం పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెరగడం, ఉత్పత్తి వ్యయం తగ్గడం, ఆక్వాకల్చర్ రంగం దీర్ఘకాలికంగా స్థిరపడేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. చివరగా మంత్రి మాట్లాడుతూ, రైతు సంక్షేమం, ఆక్వాకల్చర్ రంగ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శక విధానాలు, శాస్త్రీయ నిర్ణయాలు, అన్ని వర్గాల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను రొయ్యల ఉత్పత్తి, ఎగుమతుల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# సోలార్ కంపెనీ మోసాల నుండి రైతులను కాపాడండి రైతుల భూములకు రక్షణ కల్పించండి



**పత్తికొండ మన జన ప్రగతి జులై 15:** పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో మెగా పవర్ సోలార్ ప్రాజెక్ట్ కు లీజుకు ఇచ్చిన రైతులకు వీఆర్వో గారి సమక్షంలో హోసూరు సచివాలయం 2 నందు గ్రామసభ నిర్వహించడం జరిగినది అందులో భాగంగా రైతులు వీఆర్వో గారితో మాట్లాడుతూ తూతూ మంత్రంగా సోలార్ ప్రాజెక్టు లీజుకు ఇచ్చిన రైతులతో గ్రామ సభ నిర్వహించడం జరిగింది అందులో భాగంగా గ్రామ రైతులు మాట్లాడుతూ లీజు పేరుతో సోలార్ కంపెనీ చేస్తున్న మోసాలపై చర్యలు తీసుకోవాలని అలాగే గ్రామసభ కలెక్టర్ మరియు ఆర్డీవో లాంటి గారి అధికారులతో నిర్వహించి గ్రామ ప్రజల అభిప్రాయాలను పూర్తిస్థాయిలో తీసుకోవాలని ఏకపక్షంగా మోసపూరితంగా రైతులతో సంతకాలు చేయించుకోవడం సరి అయిన న్యాయం కాదని తప్పకుండా లీజుకు ఇచ్చిన భూములపై రైతులకు పూర్తిస్థాయి హక్కులు ఉండేటట్లు చూడాలని అదేవిధంగా అదేవిధంగా రైతుల భూములపై ఎటువంటి రుణాలు కంపెనీలు తీసుకోకూడదని వారు తెలిపారు లేనిపక్షంలో భవిష్యత్తులో రైతులతో కలిసి భూమిపై హక్కుల కోసం మరింత ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. డిమాండ్స్ ని పరిష్కరించాలని కోరారు రైతులుహోసూరు బనగాని శ్రీనివాసులు, రాజశేఖర్ నాయుడు , మధు నాగిరెడ్డి , రంగారెడ్డి, హుసేని, ఆంజనేయులు, నరసింహారెడ్డి, శాంతిరెడ్డి,కేశప్ప , అశ్వత్, వరదరాజులు, మారుతి పుల్లన్న నరసప్ప రంగస్వామి తదితర రైతులు పాల్గొన్నారు.

# చెత్తరహిత ఏపీ దిశగా వేగంగా అడుగులు: మంత్రి నారాయణ



**నెల్లూరు, మన జనప్రగతి, జూలై 15:-** ఆంధ్రప్రదేశ్‌ను చెత్తరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టిందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు.నెల్లూరు రూరల్ మండలంలోని దొంతాళి డంపింగ్ యార్డును బుధవారం పరిశీలించిన మంత్రి, ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ పనులను సమీక్షించారు. గత ప్రభుత్వం వదిలివెళ్లిన 153 లక్షల టన్నుల లెగసీ వ్యర్థాల్లో ఇప్పటికే 130 లక్షల టన్నులను తొలగించామని, మిగిలిన 23 లక్షల టన్నుల ప్రాసెసింగ్ కొనసాగుతోందని తెలిపారు. జూలై నెలాఖరుకల్లా రాష్ట్రంలోని లెగసీ వ్యర్థాల తొలగింపు పూర్తవుతుందని చెప్పారు.గుంటూరు, విశాఖలోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ద్వారా రోజుకు 2,800 టన్నుల చెత్తను శుద్ధి చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని, మరో ఆరు ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యాయని వెల్లడించారు. దొంతాళిలో జిందాల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ రెండేళ్లలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సీఈ వేణుగోపాల్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన మండల వైకాపా నాయకులు

**వేములలో విధాత్రి రెడ్డి,వి.కొత్తపల్లిలో తేజేశ్వర్ రెడ్డికి ధైర్యం**

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన మండల వైకాపా కన్వీనర్,జడ్పీటీసీ,ఎంపీపీ**



**వేముల మన జనప్రగతి జూలై 15:-**వేముల మండలంలో ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన పలువురు బాధితులను వైఎస్సార్సీపీ నాయకులు బుధవారం పరామర్శించారు.మండల కన్వీనర్ నాగెళ్ళ సాంబశివరెడ్డి,జడ్పీటీసీ కోకటం వెంకట బయపు రెడ్డి, ఎంపీపీ భర్త చల్లా వెంకట నారాయణ లు బాధితుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధితులు పూర్తి ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షిస్తూ అవసరమైతే పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ముందుగా వేముల గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ మండల మహిళా అధ్యక్షురాలు పేర్ల రమాదేవి వెంకటరామిరెడ్డి మనవరాలు విధాత్రి రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకుని ఆమెను పరామర్శించారు. చికిత్స వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు వైద్యుల సూచనలను పాటిస్తూ విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, త్వరలోనే పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం వి.కొత్తపల్లి గ్రామానికి చెందిన చందా భాస్కర్ రెడ్డి కుమారుడు చందా తేజేశ్వర్ రెడ్డి కూడా ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న నేపథ్యంలో ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగించాలని సూచించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎలాంటి ఆందోళన చెందవద్దని, త్వరగా కోలుకుని సాధారణ జీవితానికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. వేముల వైస్ ఎంపీపీ మల్ రెడ్డి,మాజీ సర్పంచ్ శ్రీనివాసులు,నాగప్ప,వి . కొత్తపల్లి యువనాయకులుపీబీవీ భాస్కర్ రెడ్డి, రఘునాథ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలి

## ● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు వంగిమల్ల రంగారెడ్డి.




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూలై 15:** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమావేశాలు బుధవారం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య అధ్యక్షతన నిర్వహించబడ్డాయి. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు వంగిమల రంగారెడ్డి పాల్గొని అన్నమయ్య జిల్లా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా జిల్లాలోని మామిడి తోటల పంట బీమా (ఇన్సూరెన్స్) సమస్య తీవ్రంగా ఉందని, బీమా ప్రీమియం చెల్లించినప్పటికి రైతులకు సరైన ప్రయోజనాలు అందడం లేదని రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించి, నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు.అలాగే జిల్లాలోని ప్రాజెక్టులకు తగినంత నీటిని విడుదలచేసి సాగునీటి అవసరాలను తీర్చాలని, రైతులకు నీటి కొరత లేకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని. ఆయన సమావేశంలో డిమాండ్ చేశారు.అన్నమయ్య జిల్లా రైతుల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించేలా రాష్ట్ర సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టినట్లు నాయకులు తెలిపారు.

# షైనింగ్ స్టార్ అవార్డుకు వేంపల్లె ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపిక



**వేంపల్లె మన జనప్రగతి జూలై 15:-** రాష్ట్ర ప్రభుత్వమ పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇచ్చే షైనింగ్ స్టార్ అవార్డుకు ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ అఫ్నాన్ ఎంపికైనట్లు కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి తెలియజేశారు. అఫ్నాన్ పదవ తరగతిలో 592 మార్కులు సాధించి మండల ఫస్ట్ సాధించిందని కరస్పాండెంట్ తెలియజేశారు. తమ పాఠశాల విద్యార్థిని అవార్డుకు ఎంపిక కావడం పట్ల కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందము హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

# టిప్పర్ బ్యాటరీల చోరీ కేసు ఛేదన..

## - ముగ్గురు నిందితులు అరెస్ట్



**రైల్వే కోడూరు మన జనప్రగతి, జూలై 15:-** రైల్వే కోడూరు అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన టిప్పర్ బ్యాటరీల చోరీ కేసును రైల్వే కోడూరు సబ్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రెడ్డి మరియు పోలీస్ సిబ్బంది కేసును ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.20 వేల విలువైన రెండు టిప్పర్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం.జతీ.చీశీ.169/2026, సెక్షన్ 303(2) దీచీూ కింద నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం ఉదయం 8.30 గంటలకు శ్రీ చౌడేశ్వరి ధాబా సమీపంలో మెండ్రగుట్టి దుర్గాప్రసాద్ (22), మెండ్రగుట్టి శివకృష్ణ (19), రాగల శివకుమార్ (33)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన రెండు టిప్పర్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని పోలీసులు తెలిపారు. అలాగే మిగిలిన చోరీ సొత్తును స్వాధీనం చేసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు సమాచారం.

# కడపతో.. దాల్మియా భారత్ అనుబంధం మరింత బలపడుతోంది

## దాల్మియా భారత్ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ పునీత్ యధు దాల్మియా

**కడప రూరల్ మన జనప్రగతి జూలై 15 :-** దాల్మియా భారత్ సంస్థకు ఆంధ్రప్రదేశ్ కేవలం వ్యాపార రాష్ట్రం మాత్రమే కాదని, ఏళ్ల నాటి సంస్థ ప్రయాణంలో కీలక భాగస్వామి అని దాల్మియా భారత్ మేనేజింగ్ డైరెక్టర్ పునీత్ యధు దాల్మియా అన్నారు. బుధవారం జమ్మలమడుగు నియోజకవర్గం, మైలవరం మండలం చిన్నకొమర్లలో నిర్వహించిన దాల్మియా భారత్ 2వ యూనిట్ విస్తరణ పనుల శంఖుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రసంగించారు.పరిశ్రమల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేగవంతమైన విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిని ప్రతి నెలా సమీక్షించడం, మంత్రివర్గం ఆమోదించిన ప్రాజెక్టుల కోసం ప్రత్యేక వాట్సాప్ బృందాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు ప్రభుత్వ పనితీరులో కొత్త సంస్కృతికి నాంది పలుకుతున్నాయని పేర్కొన్నారు.రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వం,





పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచాయని చెప్పారు. పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ బాధ్యులు భూపేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.కడప జిల్లా ప్రజలు, ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ ప్రయాణంలో భాగస్వాములుగా నిలిచారని, వారి సహకారంతోనే సంస్థ మరింత ముందుకు సాగుతోందన్నారు. కడపలో సుమారు రూ.3,100 కోట్ల పెట్టుబడితో కొత్త ఉత్పత్తి విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. వార్షికంగా 36 లక్షల టన్నుల సమీకృత సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ విస్తరణతో దేశంలోనే దాల్మియా భారత్‌కు అతిపెద్ద సమీకృత సిమెంట్ కర్మాగారం కడపలో ఏర్పడనుందని తెలిపారు.ఈ విస్తరణ పూర్తయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో సంస్థ దాదాపు కోటి టన్నుల వరకు సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకుంటుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పరిశ్రమల అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు, స్థానిక ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి విశేష ఊతం లభిస్తుందని పునీత్ యధు దాల్మియా తెలిపారు.



## ఘనంగా జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలు

**అనంతపురం మన జనప్రగతి, జూలై 15:-** జేఎన్‌టీయూ అనంతపురం పులివెందుల క్యాంపస్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ సుదర్శన్ రావు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్యతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో, మరిన్ని విజయాలు సాధిస్తూ విద్యారంగానికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ దేవన్న, డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, వివిధ విభాగాల డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

---

# భవిష్యత్‌పై విశ్వాసానికి దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ నిదర్శనం





### ఏపీ పారిశ్రామిక ప్రగతిలో దాల్మియా భారత్‌ది విలువైన భాగస్వామ్యం

### పరిశ్రమలకు కావాల్సిన విధంగా యువతను సిద్ధం చేస్తున్నాం

### నైపుణ్యాభివృద్ధిలో ఏపీకి సహకారం అందించండి

### దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్

**జమ్మలమడుగు మన జనప్రగతి జూలై 15:-** ఏపీపై విశ్వాసానికి దాల్మియా భారత్ సిమెంట్ ప్లాంట్ విస్తరణ నిదర్శనం. ఏపీ పారిశ్రామిక ప్రగతిలో దాల్మియా భారత్ ది విలువైన భాగస్వామ్యం అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమెర్ల సమీపంలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... దాల్మియా సిమెంట్స్ కడప ప్లాంట్ లైన్2 విస్తరణకు సంబంధించిన భూమిపూజ కార్యక్రమంలో మీ అందరితో కలిసి పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజు కేవలం ఒక తయారీ యూనిట్ విస్తరణ గురించి మాత్రమే కాదు.. విశ్వాసాన్ని మరింత విస్తరించే రోజు. వ్యాపారంలో మొదటి పెట్టుబడి అవకాశాలపై నమ్మకంతో వస్తుంది. రెండో పెట్టుబడి అనుభవంపై నమ్మకంతో వస్తుంది. ఇప్పటికే ఉన్న ఒక సంస్థ తన కార్యకలాపాలను విస్తరించాలని నిర్ణయించినప్పుడు అది గట్టి సందేశాన్ని ఇస్తుంది. రాష్ట్రంపై విశ్వాసం, పాలనపై విశ్వాసం, భవిష్యత్తుపై విశ్వాసం. ఈ రోజు దాల్మియా భారత్ చేపడుతున్న విస్తరణ కూడా అలాంటి విశ్వాసానికే నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున మా రాష్ట్రంపై తమ నమ్మకాన్ని మరింత బలోపేతం చేసిన దాల్మియా భారత్ కుటుంబ సభ్యులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.**పునీత్ దాల్మియా జీవితం ఎంతో స్ఫూర్తిదాయకం** పునీత్ జీ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. ఆయన ఐఐటీ ఢిల్లీ నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఐఐఎం బెంగళూరు నుంచి గోల్డ్ మెడల్ సాధించారు. నేడు దేశంలోని అత్యంత గౌరవనీయ పారిశ్రామికవేత్తల్లో ఒకరిగా నిలిచారు. అయితే నన్ను మరింతగా ప్రేరేపించేది ఏమిటంటే.. భారతదేశంలోని తొలి డిజిటల్ స్టార్టప్‌లలో ఒకటైన జీశీవిరాూష్ట్రమ్మ్మను.ఝశీవి సహస్థాపకులుగా వ్యవహరించడం. మీరు కేవలం ఒక వారసత్వాన్ని స్వీకరించలేదు.



దానికి నాయకత్వం వహించే ముందు... మీకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును నిర్మించుకున్నారు. అదే ఔత్సాహిక పారిశ్రామిక స్ఫూర్తి ఈ రోజుకీ దాల్మియా భారత్‌ను ముందుకు నడిపిస్తోంది. **మానవ వనరులే దేశానికి విలువైన సంపద** ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా... మీ నాయకత్వంలోని ఒక అంశంతో ప్రత్యేక అనుబంధం ఉంది. మీరు భారతదేశంలోని అతిపెద్ద పారిశ్రామిక సంస్థల్లో ఒకదానికి నాయకత్వం వహిస్తున్నప్పటికీ... విద్యాభివృద్ధికి, విద్యా సంస్థల నిర్మాణానికి నిరంతరం అండగా నిలుస్తున్నారు. అశోక విశ్వవిద్యాలయంతో మీ అనుబంధం... భారతదేశానికి అత్యంత విలువైన సంపద సిమెంట్, ఉక్కు కాదు, మానవ వనరులేనని మీరు విశ్వసిస్తున్నారనే విషయాన్ని ప్రతిబింబిస్తోంది. అదే తత్వాన్ని మేం కూడా బలంగా విశ్వసిస్తున్నాం. ప్రభుత్వాలు ప్రతిభను తీర్చిదిద్దుతాయి. పరిశ్రమలు అవకాశాలను సృష్టిస్తాయి. రెండూ కలిసి భవిష్యత్తును నిర్మిస్తాయి. **ఏపీ పారిశ్రామిక ప్రగతిలో దాల్మియా భారత్ ది విలువైన భాగస్వామ్యం** దాల్మియా భారత్ అనేక ఏళ్లుగా ఏపీ పారిశ్రామిక ప్రస్థానంలో భాగస్వామిగా ఉంది. ఈ రోజు జరుగుతున్న విస్తరణ మన భాగస్వామ్యానికి ఆరంభం కాదు.. ఇది పరస్పర విశ్వాసంతో కొనసాగుతున్న బంధానికి తదుపరి అధ్యాయం. రూ.3,100 కోట్ల ఈ విస్తరణ... ఏపీ పట్ల దాల్మియా భారత్‌కు ఉన్న దీర్ఘకాలిక నిబద్ధతకు నిదర్శనం. అలాగే ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. సస్టైనబిలిటీ, గ్రీన్ మ్యానుఫ్యాక్చరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ, రెస్పాన్సిబుల్ గ్రోత్.. ఇవన్నీ మేం ఎంతో విలువైనవిగా భావించే సూత్రాలు. **స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ ఏపీ బలం** ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు నిర్ణయాల్లో వేగం, విధానాల్లో స్థిరత్వం, పాలనలో సేవాభావాన్ని కోరుకుంటున్నారు. గౌరవ సీఎం చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి నాయకత్వంలో ఏపీ ఈ మూడు సూత్రాల ఆధారంగా పెట్టుబడులకు అనుకూలమైన పటిష్టమైన వ్యవస్థను నిర్మిస్తోంది. అందుకే ఇప్పటికే ఉన్న పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను విస్తరిస్తున్నారు. కొత్త పెట్టుబడిదారులు కూడా ఏపీని తమ గమ్యస్థానంగా ఎంచుకుంటున్నారు. **సుస్థిరతే అభివృద్ధికి అతిపెద్ద ప్రేరణ** ప్రపంచ దేశాలు పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వైపు అడుగులు వేస్తూ, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి అవసరమైన మౌలిక వసతులను నిర్మిస్తున్న కొద్దీ... ఉక్కు, సిమెంట్, ఇంధనం, రవాణా వంటి రంగాలపై ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ మరింత పెరుగుతుంది. **అత్యల్ప కర్బన ఉద్గారాలున్న సిమెంట్ తయారీ సంస్థల్లో దాల్మియా ఒకటి** కర్బన్ ఉద్గారాలను తగ్గించడం అత్యంత క్లిష్టమైన పరిశ్రమల్లో సిమెంట్ రంగం అత్యంత సవాలుతో కూడుకున్నది. ప్రపంచంలో అత్యల్ప కర్బన ఉద్గారాలున్న సిమెంట్ తయారీ సంస్థల్లో దాల్మియా ఒకటి. 2040 నాటికి కార్బన్ న్యూట్రల్ సంస్థగా మారాలని సంకల్పించింది. పునరుత్పాదక ఇంధనం, ఇంధన సామర్థ్యం, విద్యుత్ ఆధారిత రవాణాలో తన నాయకత్వాన్ని చాటుతూ.. ప్రపంచంలోనే =జు100, జూ100, జు౦100 కార్యక్రమాల్లో సభ్యత్వం పొందిన తొలి సిమెంట్ సంస్థగా కూడా దాల్మియా భారత్ నిలిచింది. కడప ప్లాంట్ విస్తరణ కూడా ఈ విషయాన్ని ప్రతిబింబిస్తోంది. కార్యకలాపాల్లో 80 శాతం వరకు రెన్యూవబుల్ ఎనర్జీ, వేస్ట్ హీట్ రికవరీ, మున్సిపల్ వ్యర్థాల కో ప్రాసెసింగ్, జీరో లిక్విడ్ డిశ్చార్జ్, విస్తృత స్థాయిలో వర్షపు నీటి సంరక్షణ, విద్యుత్ వాహనాల ఆధారిత లాజిస్టిక్స్, ఏఐ ఆధారిత కార్యాచరణ సామర్థ్యం, అత్యుత్తమ ఉద్గార నియంత్రణ వ్యవస్థలు వంటి అంశాలతో ఈ ప్లాంట్ భవిష్యత్తుకు సిద్ధమైన తయారీకి ఆదర్శంగా నిలుస్తోంది. ఇలాంటి పరిశ్రమలతో భాగస్వామ్యం వహించడం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో గర్వకారణం.**కష్టాన్ని నమ్ముకున్న వాళ్లు కడప జిల్లా ప్రజలు** జమ్మలమడుగు ఎప్పుడొచ్చినా జోష్ అదిరిపోతుంది. కడప జిల్లా ప్రజలు అనగానే నాకు గుర్తొచ్చేది కష్టం. కష్టాన్ని నమ్ముకున్న వాళ్లు కడప జిల్లా ప్రజలు. ఎవరి నుంచి సహాయం ఆశించరు. ఇక్కడి కార్మికులు, రైతులు ఆంధ్రప్రదేశ్ కి బ్రాండ్ అంబాసిడర్లు. ఇక్కడ రైతులు పిల్లల భవిష్యత్ కోసం భూములు త్యాగం చేశారు. మీ పిల్లలు కంపెనీలో కష్టపడి పనిచేసి మంచి పేరు తీసుకొచ్చారు. మేం అనుమతులు ఇవ్వగలం కానీ కంపెనీకి నమ్మకం మీ వలనే వస్తుంది. మీరు ఆ నమ్మకాన్ని ఇచ్చారు.**దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వచ్చాయి** మన గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, మన పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, నేను అన్ని దేశాలు తిరుగుతూ ఏపీని ప్రమోట్ చేస్తున్నాం. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని అడుగుతున్నాం. నేను యువగళం పాదయాత్రలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చా. ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడం కోసం కష్టపడుతున్నాం. రెండేళ్లలోనే అనేక పెద్ద కంపెనీలు ఏపీకి తీసుకువచ్చాం. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వచ్చాయి. కొత్త కంపెనీలు తీసుకురావడం ఎంత ముఖ్యమో.. రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన కంపెనీలు కూడా మనకి అంతే ముఖ్యం. నేను కొత్త వాళ్లను కన్విన్స్ చేయడంతో పాటు మనదగ్గర ఉన్న కంపెనీలతో ఎక్స్ పాన్షన్ చేయించాలి. అప్పుడే మనం సక్సెస్ అవుతాం. **రాష్ట్రంలో పెట్టుబడి పెట్టిన వాళ్లకి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం** మన రాష్ట్రంలో పెట్టుబడి పెట్టిన వాళ్లకి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. అందుకే వేరే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని రిక్వెస్ట్ లు వస్తున్నా.. వాళ్లు మాత్రం ఏపీనే ఎంచుకుంటున్నారు. ఈ రోజు దాల్మియా సిమెంట్స్ విస్తరణ జరగడానికి ప్రధాన కారణం ఇక్కడి రైతులు, కంపెనీని నడిపిస్తున్న ఉద్యోగులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, కార్మికులు. మీ అందరికీ అభినందనలు. కడప జిల్లా భవిష్యత్ కు మరో బలమైన పునాది వేశాం. నేను ప్రపంచం మొత్తం తిరిగి కంపెనీలు తీసుకొస్తాను. అది నా బాధ్యత. కానీ ఆ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చిన యువతపై కూడా బాధ్యత ఉంటుంది. మీ క్రమశిక్షణ, శ్రమించే తత్వం, మీ వ్యక్తిత్వం వల్ల మనకి మంచి పేరు వస్తుంది. మీరంతా కష్టపడి పనిచేస్తే మరిన్ని కంపెనీలు ఏపీకి వస్తాయి. **పరిశ్రమలకు కావాల్సిన విధంగా యువతను సిద్ధం చేస్తున్నాం** నాకొక వింత పరిస్థితి ఉంది. మేం కంపెనీ పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం.. మీ దగ్గర నిపుణులైన యువత ఉన్నారా అని కొంతమంది అడుగుతున్నారు. అందుకే ఇప్పుడు ఐటీఐలను పరిశ్రమలతో అనుసంధానిస్తున్నాం. ఒక్కో ఐటీఐని ఒక్కో కంపెనీకి అనుసంధానిస్తున్నాం. పరిశ్రమలకు కావాల్సిన విధంగా యువతను సిద్ధం చేస్తున్నాం. మొన్న శ్రీసిటీలో యూనివర్సిటీని ప్రారంభించా. అది ఇండియాలోనే ఫస్ట్ ఎల్ఈజీ(లెర్న్, ఎర్న్, గ్రాడ్యుయేట్) మోడల్ యూనివర్సిటీ. మూడు నెలలు క్లాస్ రూమ్ లో, 8 నెలలు ఇండస్ట్రీలో వర్క్. చదువుకుంటూనే సంపాదిస్తారు. చదువు పూర్తయ్యేసరికి ఉద్యోగానికి కావాల్సిన అన్ని నైపుణ్యాలు వారికి ఉంటాయి.**నైపుణ్యాభివృద్ధిలో ఏపీకి సహకారం అందించండి** ప్రపంచ స్థాయి నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను నిర్మించే మా ప్రయత్నంలో ఏపీ ప్రభుత్వానికి భాగస్వామిగా నిలవాలని పునీత్ జీని కోరుతున్నా. మా యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడంలో మాకు సహకరించండి. నైపుణ్యాభివృద్ధిలో ఏపీని దేశానికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు మాతో కలిసి పనిచేయండి. అశోక విశ్వవిద్యాలయం తరహాలో ఉన్నత విద్యను ప్రోత్సహించే మరో ప్రపంచస్థాయి విద్యాసంస్థను ఏపీలో ఏర్పాటు చేయడాన్ని కూడా మీరు పరిశీలిస్తే ఎంతో ఆనందంగా ఉంటుంది.**ఏపీని రెండో ఇల్లుగా భావించండి** ఒక వ్యాపారవేత్తగా మీ ఔత్సాహిక పారిశ్రామిక ప్రయాణం పట్ల, అలాగే మీరు భవిష్యత్తులో ప్రారంభించబోయే కొత్త వ్యాపారాల పట్ల నాకు అపారమైన గౌరవం ఉంది. ఆంధ్రప్రదేశ్‌ను మీ రెండో ఇల్లుగా భావించండి. మీరు ఏ కొత్త వ్యాపారాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నా ముందుగా మాకోసారి ఫోన్ చేయండి. మీకు అత్యుత్తమ వేదికను, అత్యంత ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను, అనుకూలమైన విధానాలను అందిస్తాం. మీతో మేం పోటీ పడేది ఒక్క విషయంలోనే... వేగంలో. నా దృష్టిలో ఇది కేవలం ఒక సిమెంట్ ప్లాంట్ విస్తరణ మాత్రమే కాదు... దాల్మియా గ్రూప్‌తో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే ఘట్టం. **అభివృద్ధిలో దాల్మియా భాగం** గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి వికసిత్ భారత్2047 దార్శనికత, మన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి స్వర్ణాంధ్ర2047 దార్శనిక మార్గదర్శకత్వంలో, దాల్మియా భారత్ ఏపీ అభివృద్ధి ప్రస్థానంలో విలువైన భాగస్వామిగా నిరంతరం కొనసాగుతుందని పూర్తి విశ్వాసం ఉందని లోకేష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దాల్మియా భారత్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియా, దాల్మియా భారత్ లిమిటెడ్ గ్రోత్ అండ్ ఎక్స్ పాన్షన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేసీ బిర్లా, నేషనల్ మ్యానుఫ్యాక్చరింగ్ హెడ్ గణేష్ వామనరావు జిర్కుంత్వార్, ప్లాంట్ హెడ్ అర్పన్ పరేఖ్, ప్రాజెక్ట్ హెడ్ అనుపమ్ అగర్వాల్, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, పరిశ్రమల శాఖ మంత్రి టీ.జీ. భరత్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, జమ్మలమడుగు నియోజక వర్గ ఎమ్మెల్యే సీ.ఆదినారాయణ రెడ్డి, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ సీహెచ్ భూపేష్ రెడ్డి, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు మంత్రి లోకేష్ శంకుస్థాపన







## రూ.3,100 కోట్ల పెట్టుబడి పెట్టనున్న దాల్మియా భారత్ సిమెంట్

**జమ్మలమడుగు మన జనప్రగతి జూలై 15:–** కడప జిల్లా మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా ప్లాంట్ ఆవరణకు చేరుకున్న మంత్రి లోకేష్ కు దాల్మియా భారత్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియా, కంపెనీ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ముందుగా దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ లో రోబో ల్యాబ్, సెంట్రల్ కంట్రోల్ రూమ్ ను మంత్రి సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్, ఏవీని వీక్షించారు. కార్మికులను పలకరించి వారితో కలిసి సెల్ఫీ దిగారు. అనంతరం పునీత్ దాల్మియాతో కలిసి దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ లైన్–2 విస్తరణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. **రూ.3,100 కోట్ల పెట్టుబడి పెట్టనున్న దాల్మియా భారత్ సిమెంట్** దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ లైన్–2 విస్తరణను రూ.3,100 కోట్ల వ్యయంతో చేపట్టనుంది. మైలవరం మండలంలోని చిన్నకొమెర్లలో ప్లాంటులో దాల్మియా సిమెంట్ ఏడాదికి 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేస్తోంది. కొత్తప్లాంట్ విస్తరణతో క్లింకర్ సామర్థ్యం 6.1 మిలియన్ టన్నులు, సిమెంట్ ఉత్పత్తి 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది. ప్లాంట్ విస్తరణతో కొత్తగా 1000 మందికి ఉద్యోగాల కల్పన జరగనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీ.జీ. భరత్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే సీ.ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు రెడ్డప్పగారి మాధవి రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ సీహెచ్ భూపేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, దాల్మియా భారత్ లిమిటెడ్ గ్రోత్ అండ్ ఎక్స్ పాన్షన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేసీ బిర్లా, నేషనల్ మ్యానుఫ్యాక్చరింగ్ హెడ్ గణేష్ వామనరావు జిర్కుంత్వార్, ప్లాంట్ హెడ్ అర్పన్ పరేఖ్, ప్రాజెక్ట్ హెడ్ అనుపమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక గణాంకాలపై అధికారులకు ప్రత్యేక శిక్షణ

- స్వర్ణాంధ్రప్రదేశ్2047 లక్ష్యాల సాధనకు దోహదపడే కార్యక్రమం



**కడప మన జనప్రగతి జూలై 15:–** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వైఎస్ఆర్ జిల్లాలోని జిల్లా, మండల స్థాయి అధికారులకు ఆర్థిక గణాంకాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించారు. పహలే ఇండియా ఫౌండేషన్ (పీఐఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో.. జిల్లా ప్రధాన ప్రణాళికాధికారి (సీపీఓ) హజరతయ్య మాట్లాడుతూ.. జిల్లా పరిపాలనకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక అంశాలతో పాటు స్థూల విలువ ఆధారిత ఉత్పత్తి (జీవీఏ), స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ), జిల్లా దేశీయోత్పత్తి (డీడీపీ) వంటి కీలక ఆర్థిక సూచికలను శాస్త్రీయంగా ఎలా లెక్కించాలో అధికారులకు వివరించారని తెలిపారు. అలాగే, ఆర్థిక గణాంకాలను సమర్థంగా వినియోగించి స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి విధానాలు రూపొందించడం, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ శిక్షణ ద్వారా అధికారులు సమగ్ర ఆర్థిక విశ్లేషణ ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించే సామర్థ్యాన్ని పెంపొందించుకున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్రప్రదేశ్2047 లక్ష్యాల సాధనలో జిల్లా పరిపాలన మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని సీపీవో పేర్కొన్నారు.

# దాల్మియా విస్తరణ జిల్లా అభివృద్ధికి ఓ కీలక ఘట్టం: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప రూరల్ మన జనప్రగతి జూలై 15 :–** దాల్మియా భారత్ సిమెంట్ విస్తరణ ప్రాజెక్టు ప్రారంభం జిల్లాకు ఒక కీలక ఘట్టమని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అభివర్ణించారు. బుధవారం జమ్మలమడుగు నియోజకవర్గం, మైలవరం మండలం చిన్నకొమర్లలో నిర్వహించిన దాల్మియా భారత్ 2వ యూనిట్ విస్తరణ పనులకు రాష్ట్ర ఐటి, విద్యా శాఖామంత్రి నారా లోకేష్ శంఖుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడప జిల్లాలో అపారమైన సహజ వనరులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భారతదేశంలోనే అత్యంత ముఖ్యమైన సున్నపురాయి నిల్వలు కలిగిన జిల్లాల్లో కడపకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. ఈ వనరులను ఆధారంగా చేసుకుని సిమెంట్ పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. సిమెంట్ పరిశ్రమ కాలుష్య ప్రభావం కలిగిన రంగమైనప్పటికీ, ఆధునిక సాంకేతికతతో పర్యావరణహిత ఉత్పత్తి విధానాలను అమలు చేస్తూ గ్రీన్ సిమెంట్ తయారీ దిశగా దాల్మియా యాజమాన్యం అడుగులు వేయడం అభినందనీయమని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగంలోనూ కడప జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగులు వేస్తోందన్నారు. 21 గిగావాట్ల సామర్థ్యంతో సౌర, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. వీటి ద్వారా కడపను పరిశ్రమలతో పాటు హరిత జిల్లాగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధికి దాల్మియా యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. దాల్మియా భారత్ సంస్థ తమా ఉత్పత్తి ఆదాయంపై మాత్రమే ఆలోచించకుండా.. సామాజిక బాధ్యతలో భాగంగా సుమారు రూ.42 కోట్లతో ప్రాజెక్టు పరిసర గ్రామాల్లో విద్య, నైపుణ్య శిక్షణ, మహిళల సాధికారత, ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలను ఖర్చు చేస్తోందని తెలిపారు. ప్రభావిత గ్రామాల ప్రజలకు శిక్షణ అందించేందుకు ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సామాజిక బాధ్యతతో పెట్టుబడులు పెడుతున్న దాల్మియా ప్రాజెక్టు విజయవంతంగా అమలయ్యేలా.. జిల్లా యంత్రాంగం తరఫున, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా భావించిన కడప జిల్లా నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. జిల్లాలోని లింగాల మండలం ప్రస్తుతం దేశంలోనే వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తిలో విశేష గుర్తింపు పొందిందని తెలిపారు. ముఖ్యంగా బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్) విస్తరణతో రిజర్వాయర్ల నుండి నీటి వినియోగం తగ్గి, దిగుబడులు పెరిగాయన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఇజ్రాయెల్‌లో అమలవుతున్న ఆధునిక వ్యవసాయ విధానాలను అధ్యయనం చేసి, వాటిని రాష్ట్రంలో ప్రవేశపెట్టడం వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రోత్సాహంతో ప్రతి ఏడాది వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అరటి వంటి ఉద్యాన పంటల ఆధారంగా ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు యువతకు స్థిరమైన ఉద్యోగాలను అందిస్తున్నాయని జిల్లా కలెక్టర్ ప్రభుత్వ విధానాలను. ప్రశంసించారు.

# ప్రతి మహిళకు 'మన డబ్బులు-మన లెక్కలు' యాప్‌పై అవగాహన అవసరం




**తిరుపతి మన జనప్రగతి జూలై 15:–**పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు 'మన డబ్బులు–మన లెక్కలు' యాప్‌పై అవగాహన, శిక్షణ కార్యక్రమం బుధవారం స్థానిక మెప్మా కార్యాలయంలో నిర్వహించారు. తిరుపతి జిల్లా డి.పి.యం.యు. సిబ్బంది ఐ.టి.శంకర ప్రసాద్, ఐ.బి. రమణ, సి.యం.యం. యస్. కృష్ణవేణి మరియు యస్. సోమ కుమార్ అధ్యక్షతన ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సంఘాల రిసోర్స్ పర్సన్లు, ఎస్‌హెచ్‌జీ నాయకులకు యాప్ వినియోగం, మొబైల్ బుక్ కీపింగ్ విధానం, ఆర్థిక లావాదేవీల నమోదు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. 'మహిళా ఆకాశం' యాప్‌లోని మొబైల్ బుక్ కీపింగ్‌తో సంఘాల ఆర్థిక లావాదేవీలన్నింటినీ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఈ యాప్ ప్రధానోద్దేశం సంఘ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించడం, సభ్యుల హాజరు నమోదు, పుస్తకాల నిర్వహణ, నెలవారీ ఆర్థిక లావాదేవీలను డిజిటల్ రూపంలో నమోదు చేయడం, ప్రతి సభ్యురాలికి తమ సంఘం ఆర్థిక వ్యవహారాలపై పూర్తి అవగాహన కల్పించడమేనని వివరించారు. వచ్చే మార్చి నాటికి 100 శాతం స్వయం సహాయక సంఘ సభ్యులు తమ ఆర్థిక లెక్కలను యాప్‌లో స్వయంగా చూసుకునే స్థాయికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశాలు, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ంజు–వై. ప్రమీల, మరియు ఙజూ– మహేష్,కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఎం.రాజ్య లక్ష్మి, ఏం.కావమ్మ, ఎం.సుజాత, ఎం.అమ్మాజి, ఎస్.కె. అజీజున్నిసా, ఎన్. మహేశ్వరి, జి. సురేంద్ర బాబు, పి. సరస్వతి, కె. స్వాతి, వార్డు రిసోర్స్ పర్సన్లు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

# కడప జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటన

## దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్

### విద్యార్థుల అభ్యసన ఫలితాలపై ఆరా





**ప్రొద్దుటూరు మన జనప్రగతి జూలై 15:–** కడప జిల్లాలో పర్యటించిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల అభ్యసన ఫలితాలు, పాఠశాల పనితీరుపై ఆరా తీశారు. ముందుగా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మంత్రి సంభాషించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల అందజేత, వాటి నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇరాన్–అమెరికా యుద్ధాన్ని ఎంతమంది గమనిస్తున్నారని అడిగారు. విద్యతో పాటు శారీరక వ్యాయామం ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. **నా భవిష్యత్ మీపై ఆధారపడి ఉంది** మీకు మార్కులు రాకపోతే నా మార్కులు పోతాయని విద్యార్థులను ఉద్దేశించి ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. నా భవిష్యత్ మీపై ఆధారపడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రజాప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోంది. అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం, షూ, తల్లికి వందనం పథకాలను అమలుచేస్తోందని వివరించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను ఆరా తీశారు. ఐవీఆర్ఎస్ ద్వారా తల్లిదండ్రులు ఫీడ్ బ్యాక్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం బాగుందని ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రి నారా లోకేష్ కు వివరించారు. **లెర్నింగ్ అవుట్ కమ్స్ పై దృష్టి పెట్టాలి**పాఠశాల తనిఖీ సందర్భంగా విద్యార్థుల అభ్యసన ఫలితాలపై మంత్రి ఆరా తీశారు. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో పాఠశాల 1.3 స్టార్ రేటింగ్ పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.ధనలక్ష్మిని మంత్రి ప్రశ్నించారు. ఫార్మాటివ్, సమ్మెటివ్ అసెస్ మెంట్ పై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని, లెర్నింగ్ అవుట్ కమ్స్ పై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. పనితీరులో వెనుకబడిన పాఠశాలల పట్ల ఎంఈవోలు దృష్టిపెట్టాలని, 15 రోజులకోసారి సమీక్ష చేయాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తక్కువగా ఉండటంపైనా మంత్రి ఆరా తీశారు. హాజరుపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరయ్యే పరిస్థితిని నివారించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల ఎన్ రోల్ మెంట్ గతేడాది కంటే తక్కువగా ఉండటంపై మంత్రి ఆరా తీశారు. 10 మంది విద్యార్థులు వసతిగృహాలకు, కేజీబీవీలకు తరలివెళ్లడం వల్ల ఎన్ రోల్ మెంట్ తగ్గిందని ప్రిన్సిపాల్ వివరించారు. గతేడాది కంటే అడకమిక్ ఫెర్ఫార్మెన్స్ మెరుగుపడటం పట్ల మంత్రి ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకు ఉపాధ్యాయుల సహకారం కావాలని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ లక్ష్యమని, అందరం కలిసికట్టుగా ఉంటేనే ఇది సాధ్యమని చెప్పారు. విద్యార్థుల డ్రాప్ అవుట్స్ పై దృష్టిపెట్టాలని.. ముఖ్యంగా విద్యార్థినులు డ్రాప్ అవుట్స్ కాకుండా చూడాలన్నారు. ప్రతి విద్యార్థిని ట్రాక్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో వచ్చే ఏడాదికి 4 స్టార్ రేటింగ్ సాధిస్తామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారు. అనంతరం అందరితో కలిసి మంత్రి ఫోటోలు దిగారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174